www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 64 | | 15-8-2026 | | శనివారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-

# వికసిత భారత్‌కు 'సప్తధార'!

- ప్రపంచ నాయకత్వమే భారత్ లక్ష్యం
- తయారీ నుంచి రక్షణ దాకా ఏడు రంగాలపై గురి
- యువశక్తి.. సాంకేతికతతో సరికొత్త ప్రగతి పథం
- జనగణనలో కచ్చితమైన సమాచారమివ్వాలని పిలుపు
- స్వయం సమృద్ధితో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్
- ఎర్రకోట నుంచి భవిష్యత్ భారతానికి మోదీ దిశానిర్దేశం




వివరాలు 4వ పేజీలో





## తెలంగాణను ప్రపంచంతో పోటీ పడేలా
# తీర్చిదిద్దుతాం

ఉద్యోగ నియామకాలు మా ప్రభుత్వ కీలక బాధ్యత

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నదే మా విధానం

### కృష్ణా-గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను వదులుకోం

- విద్య, వైద్యం, ఉపాధి.. ప్రతి కుటుంబానికి భరోసా
- యువతకు నైపుణ్యాలు.. మహిళలకు ఆర్థిక స్వావలంబన
- 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 2047 నాటికి 3లక్షల కోట్ల డాలర్ల తెలంగాణను నిర్మిస్తాం
- గోల్కొండ కోట నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

"తెలంగాణ ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తాం. రైతు నుంచి విద్యార్థి వరకు, మహిళ నుంచి నిరుద్యోగ యువకుడి వరకు ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు తీసుకురావడమే మా ప్రజా ప్రభుత్వ లక్ష్యం. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్లు, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యం కూడా ఇదే దిశగా రూపొందింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

- హైదరాబాద్, ఆగస్టు 15

2



## రేషన్ కార్డు ఆత్మగౌరవ ప్రతీక

- పేదరికం నిర్మూలించే బలమైన అడుగు
- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్
- రేషన్ కార్డులతో పాటు..సన్న బియ్యం ఘనత మాదే
- సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- కేసీఆర్ వస్తే ఎవరేం చేశారో చర్చిస్తాం: సీఎం
- బీజేపీ, బీఆర్ఎస్ ఒకే నాణేనికి బొమ్మా బొరుసు
- సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

2

## పాక్ ఉగ్రవాద సంస్థతో లింకులు

- బెంగుళూరులో బెంగాల్ యువకుడి అరెస్ట్



.. వివరాలు 4లో

## టీహెచ్‌డీసీ సొరంగ ప్రమాదం

- ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య



4

భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్ష మందితో

## 'వందేమాతరం' దమ్ముంటే అడ్డుకోండి

ఎంఐఎంకు బండి సంజయ్ సవాల్



.. వివరాలు 2లో

## సంగారెడ్డి సభలో రేవంత్‌వన్నీ అబద్ధాలే

- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న ముఖ్యమంత్రి
- సాయంత్రం 4.20కి ప్రసంగం మొదలుపెట్టి '420' మాటలు మాట్లాడారు
- రేషన్‌కార్డుల నుంచి ఉద్యోగాల దాకా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- రుణమాఫీపై రేవంత్‌కు హరీశ్‌రావు రాజీనామా సవాల్

3



## ఇంటికి వచ్చి ఉరికించి కొడతాం

- హద్దు మీరితే ఇంటికొచ్చి గుణపాఠం చెబుతాం
- బీజేపీ ఎంపీ అరవింద్‌కు కాంగ్రెస్ నేతల హెచ్చరిక
- మహేశ్‌కుమార్ గౌడ్‌పై వ్యాఖ్యలను ఖండించిన నేతలు
- పసుపు బోర్డు?గల్ఫ్ బాధితులకు ఏం చేశారంటూ నిలదీత
- దమ్ముంటే ఎంపీ పదవికి రాజీనామా చేసి గెలవాలని సవాల్

2



## బేవకూఫ్ ఇప్పుడే చెప్పిన కదా!..

- జర్నలిస్టుపై నోరు పారేసుకున్న బీజేపీ ఎంపీ అర్వింద్
- వెంటనే క్షమాపణ చెప్పాలని టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్



2

విలేకరుల సమావేశంలో తనను ప్రశ్న అడిగిన జర్నలిస్టుపై నిజామాబాద్ బీజేపీ అర్వింద్ నోరు పారేసుకున్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనను ప్రశ్న అడిగిన జర్నలిస్టును ఉద్దేశించి 'బేవకూఫ్' ఇప్పుడే చెప్పిన కదా..! వినా లే..' అంటూ అహంకార ధోరణిలో వ్యాఖ్య లు చేశారు. జర్నలిస్టుపై ఎంపీ అర్వింద్ చేసి న వ్యాఖ్యల వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. జర్నలిస్టులు ఎంపీ అహంకార ధోరణిపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

## గ్యాస్ ఈకేవైసీకి

నేటితో ముగియనున్న గడువు



2

## తెలంగాణపై ఏపీ నీటి కుట్రలు

2

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్‌కు లేఖ దుర్మార్గం

మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్



## నల్సార్ విద్యార్థులకు బీసీఐ చైర్మన్ క్షమాపణ

2

- మనోభావాలు దెబ్బతీసి ఉంటే మన్నించాలని లేఖ






# భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్ష మందితో 'వందేమాతరం'

**దమ్ముంటే అడ్డుకోండి.. ఎంఐఎంకు బండి సంజయ్ సవాల్**

**గీతాన్ని అవమానిస్తే మూడేళ్ల జైలు, జరిమానా తప్పదని హెచ్చరిక**

**స్మార్ట్ రేషన్ కార్డులపై సీఎం, మంత్రుల ఫొటోలెందుకని ప్రశ్న**

**ఉచిత బియ్యంపై మోదీ ఫొటో ఎందుకు లేదని నిలదీత**

**హైదరాబాద్, ఆగస్టు 15:** పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్ష మందితో సామూహికంగా 'వందేమాతరం' గీతాలాపన చేయిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. "ఎంఐఎం నేతలారా.. దమ్ముంటే అడ్డుకోండి.." అంటూ సవాల్ విసిరారు. వందేమాతరం గీతాన్ని అవమానిస్తే మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా తప్పదని హెచ్చరించారు. చట్ట ప్రకారం వ్యవహరిస్తున్న తమను మతతత్వవాదులుగా చిత్రీకరించడం ఏమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. దేశభక్తిని చాటే వందేమాతరం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. భాగ్యలక్ష్మి ఆలయం వద్ద భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించి సామూహిక గీతాలాపన నిర్వహిస్తామని ప్రకటించారు. ఇదే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపైనా బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. స్మార్ట్ రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలను ఎందుకు ముద్రించారని ప్రశ్నించారు. తెలంగాణలో దాదాపు రెండు కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం అందిస్తోందని పేర్కొన్నారు. అలాంటప్పుడు రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదని నిలదీశారు. కేంద్రం అందిస్తున్న బియ్యం రాష్ట్ర ప్రభుత్వానికి అవసరం లేదా అని ప్రశ్నించారు. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వ హయాంలో వందల కోట్ల రూపాయలతో రూపొందించిన స్మార్ట్ కార్డులు చివరకు నిరుపయోగంగా మారాయని బండి సంజయ్ గుర్తుచేశారు. తెలంగాణలోనూ ప్రచారం కోసం ప్రజాధనాన్ని వృథా చేయకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనంగా ఉందని, "తుమ్మితే ఊడిపోయే పరిస్థితిలో ఉంది" అంటూ ఎద్దేవా చేశారు.

# గ్యాస్ ఈకేవైసీకి నేటితో ముగియనున్న గడువు

**పూర్తి చేయాలంటూ వినియోగదారులకు ఏజెన్సీల సందేశాలు**

**గ్యాస్ ఏజెన్సీల వద్ద పెరిగిన వినియోగదారుల రద్దీ**

**గడువు పొడిగింపుపై స్పష్టత కోసం ఎదురుచూపులు**

**హైదరాబాద్, ఆగస్టు 15:** గ్యాస్ వినియోగదారుల ఈకేవైసీ ప్రక్రియకు ఈ నెల 16వ తేదీ సాయంత్రంతో గడువు ముగియనున్న నేపథ్యంలో వినియోగదారుల్లో హడావుడి మొదలైంది. ఈకేవైసీని తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలంటూ పలు గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు సందేశాలు పంపడంతో పాటు ఫోన్లు చేసి సమాచారం అందిస్తున్నాయి. దీంతో ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు ఏజెన్సీల వద్ద వినియోగదారులు క్యూకడుతున్నారు. ఈకేవైసీ పూర్తి చేయకపోతే గ్యాస్ సరఫరా, సబ్సిడీ విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయనే ప్రచారం జరుగుతుండటంతో వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది. గడువు సమీపిస్తుండటంతో చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఏజెన్సీల నిర్వాహకులు సూచిస్తున్నారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవం, ఆ వెంటనే ఆదివారం రావడంతో ఏజెన్సీలు పనిచేస్తాయా లేదా అనే విషయంలో వినియోగదారుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కొందరు ఏజెన్సీల నిర్వాహకులు స్పందిస్తూ గడువు నేపథ్యంలో సెలవు రోజుల్లోనూ సేవలు అందించే అవకాశం ఉందని చెబుతున్నారు. గడువు పొడిగింపుపై ఉన్నతస్థాయి నుంచి నిర్ణయం వస్తే పరిస్థితి మారవచ్చని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గడువు పొడిగింపుపై అధికారిక ప్రకటన కోసం ఎదురుచూడకుండా వినియోగదారులు తమ గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈకేవైసీ స్థితిని తెలుసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల గడువు ముగింపు

**హైదరాబాద్, ఆగస్టు 14** హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఈ నియోజకవర్గాల నుంచి మొత్తం 60,014 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 20వ తేదీ తర్వాత లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ పి.వి. గౌతం తెలిపారు. మరోవైపు, నగరంలోని మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం రేపటి నుంచి కొత్తగా దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎల్బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల ప్రజలు సెప్టెంబర్ 3వ తేదీ వరకు 'మీ సేవ' కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ నియోజకవర్గాల లబ్ధిదారుల కోసం నిర్మించనున్న ఇళ్ల ప్రాంతాలను కూడా అధికారులు ఖరారు చేశారు. ఎల్బీనగర్ వాసులకు ఆమన్ గల్‌లో, గోషామహల్, ముషీరాబాద్ వాసులకు జమిస్తాన్‌పూర్‌లో, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని వారికి బండ్లగూడలో ఇళ్లను కేటాయించనున్నారు.



# తెలంగాణను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం

- ఉద్యోగ నియామకాలు మా ప్రభుత్వ కీలక బాధ్యత
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నదే మా విధానం
- కృష్ణా-గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను వదులుకోం
- విద్య, వైద్యం, ఉపాధి.. ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తాం
- యువతకు నైపుణ్యాలు.. మహిళలకు ఆర్థిక స్వావలంబన
- 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల తెలంగాణను నిర్మిస్తాం
- గోల్కొండ కోట నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 15:** "తెలంగాణ ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తాం. రైతు నుంచి విద్యార్థి వరకు, మహిళ నుంచి నిరుద్యోగ యువకుడి వరకు ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు తీసుకురావడమే మా ప్రజా ప్రభుత్వ లక్ష్యం. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్లు, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యం కూడా ఇదే దిశగా రూపొందింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. "ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. వారి ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధితో కూడిన తెలంగాణను నిర్మించుకోవాలి. అందుకు ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి" అని పిలుపునిచ్చారు. "నిరుద్యోగ యువత ఎదురుచూపుల బాధ నాకు తెలుసు. అందుకే ఉద్యోగ నియామకాలను మా ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుంది. ఇప్పటివరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. గ్రూప్ పరీక్షలు, మెగా డీఎస్సీ సహా నియామక ప్రక్రియలను సమర్థంగా నిర్వహించాం. నియామక వ్యవస్థపై యువతకు నమ్మకం కలిగేలా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. ఉద్యోగాలతో పాటు యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని సీఎం వివరించారు. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటదన్నది నా బలమైన నమ్మకం. అందుకే వ్యవసాయాన్ని పండగ చేయాలని నిర్ణయించుకున్నాం. రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసాతో పెట్టుబడి సాయం అందిస్తున్నాం. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు పండించిన ప్రతి గింజకు విలువ దక్కేలా మా ప్రభుత్వం రైతుకు అండగా నిలబడుతుంది" అని రేవంత్‌రెడ్డి చెప్పారు. "కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. మనకు హక్కుగా రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధిస్తాం. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. పాలమూరు రైతుల పొలాలకు నీళ్లు పారిస్తాం. తెలంగాణ రైతుల కళ్లలో ఆనందం చూడడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. రాష్ట్రానికి కృష్ణా, గోదావరి జలాల్లో న్యాయమైన వాటా సాధిస్తామన్న ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి గత స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనూ ప్రకటించారు.



## పేదవాడికి వైద్యం భారంగా మారొద్దు

"డబ్బులు లేవనే కారణంతో ఏ పేద కుటుంబం వైద్యానికి దూరం కాకూడదు. అందుకే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. నిమ్స్‌లో 2 వేల పడకల కొత్త ఆసుపత్రితో పాటు రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయాలను విస్తరిస్తున్నాం. కొత్త వైద్య, నర్సింగ్, పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ప్రజలకు విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా భావిస్తున్నాం" అన్నారు. "పేదవాడి బిడ్డ కూడా కార్పొరేట్ స్థాయి విద్యను పొందాలి. చదువుతో పాటు నైపుణ్యాలు నేర్చుకోవాలి. అందుకే నియోజకవర్గాల్లో సమీకృత పాఠశాలలను నిర్మిస్తున్నాం. వందకు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తాం. మన పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం" అని సీఎం చెప్పారు. "మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం ఎదుగుతుంది. కుటుంబం ఎదిగితేనే తెలంగాణ ఎదుగుతుంది. అందుకే కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. మహిళా సంఘాలకు వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నాం. ఆర్టీసీ అద్దె బస్సులకు మహిళలను యజమానులుగా చేస్తున్నాం. పేద కుటుంబాలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందిస్తూ ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితులు కల్పిస్తున్నాం" అన్నారు.

## యువత చేతుల్లోనే తెలంగాణ భవిష్యత్తు

"మన యువతలో ప్రతిభకు కొదవలేదు. వారికి అవకాశం, శిక్షణ, వేదిక కావాలి. చదువుతో పాటు నైపుణ్యాలను అందిస్తాం. క్రీడల్లో మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తాం. తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా తీర్చిదిద్దుతాం. మన యువత ప్రపంచస్థాయిలో తెలంగాణ పేరు నిలబెట్టేలా ప్రభుత్వం అండగా ఉంటుంది" అని భరోసా ఇచ్చారు. "హైదరాబాద్ మన రాష్ట్రానికి ఆర్థిక ఇంజిన్. ఈ నగరాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలి. ప్రాంతీయ రింగురోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, చెరువుల పరిరక్షణతో భవిష్యత్ హైదరాబాద్‌ను నిర్మిస్తున్నాం. పెట్టుబడులు తీసుకొస్తాం.. పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం.. మన యువతకు ఇక్కడే ప్రపంచస్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## ప్రపంచానికి తెలంగాణ సత్తా చూపిస్తాం

"మన లక్ష్యాలు చిన్నవి కావు. తెలంగాణకు ఉన్న శక్తి, సామర్థ్యాలపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే మన లక్ష్యం. ఇది కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సంకల్పం కావాలి. ప్రజలు ఎదిగినప్పుడే తెలంగాణ నిజంగా ఎదిగినట్లు" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. "సంక్షేమం మా బాధ్యత.. అభివృద్ధి మా సంకల్పం.. సామాజిక న్యాయం మా విధానం. రైతు ముఖంలో ఆనందం, యువత చేతిలో ఉద్యోగం, మహిళలకు ఆర్థిక స్వావలంబన, పేదలకు విద్య--వైద్యం అందిస్తూ ప్రపంచంతో పోటీ పడే తెలంగాణను నిర్మిస్తాం. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాన్ని ప్రజలందరి సహకారంతో సాధించి తీరుతాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# రేషన్ కార్డు ఆత్మగౌరవ ప్రతీక

**పేదరికం నిర్మూలించే బలమైన అడుగు**

**పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్**

**రేషన్ కార్డులతో పాటు..సన్న బియ్యం ఘనత మాదే**

**సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం**

**కేసీఆర్ వస్తే ఎవరేం చేశారో చర్చిస్తాం**

**బీజేపీ, బీఆర్ఎస్ ఒకే నాణేనికి బొమ్మా బొరుసు**

**సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సీఎం**



**సంగారెడ్డి, ఆగస్టు 15:** "రేషన్ కార్డు అంటే కేవలం ప్లాస్టిక్ కార్డు కాదు.. ఉచితంగా బియ్యం తీసుకునే సాధనం అంతకన్నా కాదు. అది పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక. పేదరికాన్ని నిర్మూలించే దిశగా మా ప్రజా ప్రభుత్వం వేసిన బలమైన అడుగు. తెలంగాణలో ఏ ఒక్క పేదవాడూ ఆకలితో అలమటించకూడదన్నదే మా సంకల్పం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. "స్వాతంత్ర్య దినోత్సవం రోజున వేలాది మంది మహిళల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలన్న ఇందిరమ్మ ఆశయమే మా ప్రభుత్వానికి మార్గదర్శకం. ఆ స్ఫూర్తితోనే ప్రజా సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాక కొత్త కార్డుల జారీని ప్రారంభించాం. రేషన్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. ఇప్పుడు అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నాం" అని సీఎం చెప్పారు. రాష్ట్రంలో 1.06 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా దాదాపు 3.48 కోట్ల మందికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. "గతంలో పేదలకు ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని మనుషులు తినలేని పరిస్థితి ఉండేది. అది పక్కదారి పట్టేది. ఇప్పుడు ప్రతి పేద కుటుంబం గౌరవంగా తినే సన్నబియ్యం అందిస్తున్నాం. ఒక్కొక్కరికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నాం. ఇందుకోసం రూ.14,800 కోట్లు ఖర్చు చేస్తున్నాం. పేదల కడుపు నింపడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను మేం నెరవేరుస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## కేసీఆర్ వస్తే అసెంబ్లీలోనే తేల్చుకుందాం


"పేదలకు ఎవరు ఏం చేశారో చర్చించడానికి మేం సిద్ధం. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. పదేళ్లలో మీరు ఏం చేశారో చెప్పండి.. మా పాలనలో మేం ఏం చేశామో చెబుతాం. సంక్షేమంపై అసెంబ్లీ వేదికగా లెక్కలతో చర్చిద్దాం" అంటూ రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రైతుల సంక్షేమంపైనా తమ ప్రభుత్వానికి స్పష్టమైన చిత్తశుద్ధి ఉందన్నారు. "రైతులు పండించిన ధాన్యానికి రూ.90 వేల కోట్లు చెల్లించాం. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతును రాజుగా చూడాలన్నదే మా విధానం" అని చెప్పారు. "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాం. గతంలో బతుకమ్మ చీరల్లోనూ కమీషన్ల కోసం చూశారు. మేం ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం" అని సీఎం అన్నారు. గత ప్రభుత్వ గృహ నిర్మాణ విధానంపై రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. "డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లంటూ గొప్పలు చెప్పారు. పేదలకు మాత్రం ఇళ్లు రాలేదు.. పాలకులకు ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. మేం ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలకు అందిస్తున్నాం. తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండకూడదన్నదే మా లక్ష్యం" అని చెప్పారు. కొత్తగా 2.5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తున్నామని, అర్హులైన చేనేత, గీత కార్మికులకు కూడా పెన్షన్లు అందిస్తామని ప్రకటించారు. "కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలు వచ్చాయి. కానీ తెలంగాణ నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. మా ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తోంది. యువతను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధిపొందాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. వారి మాయమాటలను నమ్మొద్దు" అని సీఎం పిలుపునిచ్చారు. "గత పాలకులు చేసిన అప్పులకు మేం వేల కోట్ల రూపాయల వడ్డీలు కడుతూనే ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా పేదలకు ఇచ్చిన మాట నుంచి వెనక్కి తగ్గేది లేదు. మాట ఇస్తే మట్టిలో కలిసే వరకు దానిపై నిలబడే ప్రభుత్వం మాది. తెలంగాణను సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. "బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరు కాదు. అవి ఒకే నాణేనికి బొమ్మా బొరుసు. పేదవాడి ఆకలి తీర్చడం, రైతుకు అండగా నిలవడం, మహిళలకు భరోసా ఇవ్వడం, యువతకు ఉద్యోగాలు కల్పించడమే మా ప్రజా ప్రభుత్వ ఎజెండా" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# నల్సార్ విద్యార్థులకు బీసీఐ ఛైర్మన్ క్షమాపణ

**ఎన్‌రోల్‌మెంట్ నిలిపివేత ఉత్తర్వులపై మిశ్రా విచారం**

**విద్యార్థుల మనోభావాలు దెబ్బతీసి ఉంటే మన్నించాలని లేఖ**

**హైదరాబాద్, ఆగస్టు 16:** నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను నిలిపివేస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వెనక్కి తగ్గారు. ఈ వ్యవహారంలో తన లేఖ లేదా వ్యాఖ్యలు విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసి ఉంటే క్షమించాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన లేఖలో విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ తెలిపారు. విచారం వ్యక్తం చేయడం ప్రతిష్ఠకు, అహంకారానికి సంబంధించిన అంశం కాదని మిశ్రా పేర్కొన్నారు. విద్యార్థుల భావాలు, వారి ఆందోళనలకు విలువ ఇవ్వడమే ముఖ్యమని తెలిపారు. నల్సార్ విద్యార్థుల విషయంలో చోటుచేసుకున్న పరిణామాలపై విచారం వ్యక్తం చేశారు. నల్సార్ 2026 గ్రాడ్యుయేట్ బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దంటూ బీసీఐ ఇటీవల రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేయడంతో వివాదం చెలరేగింది. విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హాజరుకావడాన్ని సుమారు 450 మంది విద్యార్థులు వ్యతిరేకించిన నేపథ్యంలో బీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. నీట్--యూజీ పేపర్ లీక్ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్ స్పందించిన తీరును ఆక్షేపిస్తూ విద్యార్థులు నిరసనకు దిగారు. బీసీఐ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. సామాజిక మాధ్యమాల్లోనూ పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తం కావడంతో గంటల వ్యవధిలోనే




ఎన్‌రోల్‌మెంట్ నిలిపివేత నోటిఫికేషన్‌ను బీసీఐ ఉపసంహరించుకుంది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ధర్మాసనం కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. శాంతియుతంగా నిరసన తెలియజేయడం విద్యార్థుల హక్కని స్పష్టం చేస్తూ, ఈ విషయంలో బీసీఐ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. తాజాగా బీసీఐ ఛైర్మన్ స్వయంగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పడంతో కొద్దిరోజులుగా కొనసాగుతున్న వివాదం సద్దుమణిగినట్లయింది.

# సంగారెడ్డి సభలో రేవంత్‌వన్నీ అబద్ధాలే

- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న ముఖ్యమంత్రి
- సాయంత్రం 4.20కి ప్రసంగం మొదలుపెట్టి '420' మాటలు మాట్లాడారు
- రేషన్‌కార్డుల నుంచి ఉద్యోగాల దాకా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- రుణమాఫీపై రేవంత్‌కు హరీశ్‌రావు రాజీనామా సవాల్



**సిద్దిపేట, ఆగస్టు 15:** సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాల ప్రచారం చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. దేశంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఇంతటి చిల్లర మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి మరొకరు ఉండరని విమర్శించారు. సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి సభలో రేవంత్‌రెడ్డి సాయంత్రం 4.20 గంటలకు ప్రసంగం ప్రారంభించి '420 మాటలు' మాట్లాడారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి గురించి ఒక్క మాట కూడా మాట్లాడకుండా కేసీఆర్‌పై విమర్శలకే ప్రసంగాన్ని పరిమితం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ చేతకానితనం వల్లే సింగూరు ఖాళీ అయిందని హరీశ్‌రావు ఆరోపించారు. దీంతో కామారెడ్డి జిల్లాకు మంచినీటి సమస్య ఏర్పడిందన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం గత ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను ప్రారంభిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని మూలన పడేసిందని విమర్శించారు. జహీరాబాద్‌లో బసవేశ్వర విగ్రహాన్ని ప్రారంభించి ఏడాది గడిచినా అప్పట్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. మూడేళ్లలో సంగారెడ్డి జిల్లాలో ఒక్క కొత్త రోడ్డైనా వేశారా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆరు లక్షలకు పైగా రేషన్‌కార్డులు ఇచ్చినట్లు అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డే చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి మాత్రం గత ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల ముందు అబద్ధాలు చెప్పడం మానుకోవాలని, ఇలాంటి ప్రచారానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఉద్యోగాల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలకు రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు ఇచ్చి తన ఖాతాలో వేసుకుంటున్నారని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్‌గాంధీ సమక్షంలో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ.. "గన్‌మెన్లు లేకుండా అశోక్‌నగర్‌కు వచ్చే ధైర్యం ఉందా?" అని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. రెండేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. బకాయిలు అందక కళాశాలలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే విద్యార్థుల భవిష్యత్తు ఏమవుతుందని ప్రశ్నించారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందని మండిపడ్డారు. రైతుల గురించి మాట్లాడే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో వరుసగా రైతుబంధు కింద భారీగా నిధులు అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతులకు అందాల్సిన సాయాన్ని తగ్గించిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే సుమారు రూ. 15 వేల కోట్లు తక్కువగా ఇచ్చారని పేర్కొన్నారు. రుణమాఫీపైనా ముఖ్యమంత్రికి హరీశ్‌రావు సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి సొంత గ్రామానికి వెళ్లి అక్కడి రైతులందరికీ రుణమాఫీ జరిగిందో లేదో తెలుసుకుందామన్నారు. రైతులందరికీ రుణమాఫీ జరిగిందని తేలితే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. రుణమాఫీ జరగలేదని రైతులు చెబితే ముఖ్యమంత్రి పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేసేందుకు సిద్ధమా అని హరీశ్‌రావు సవాల్ చేశారు.

# ఇంటికి వచ్చి ఉరికించి కొడతాం

- హద్దు మీరితే ఇంటికొచ్చి గుణపాఠం చెబుతాం
- బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు కాంగ్రెస్ నేతల ఘాటు హెచ్చరిక
- మహేశ్‌కుమార్ గౌడ్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన నేతలు
- పసుపు బోర్డు ఎక్కడ?.. గల్ఫ్ బాధితులకు ఏం చేశారంటూ నిలదీత
- దమ్ముంటే ఎంపీ పదవికి రాజీనామా చేసి గెలవాలని సవాల్




**హైదరాబాద్, ఆగస్టు 16:** టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌పై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అరవింద్ తన నోటి దురుసును అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. మరోసారి హద్దులు దాటి మాట్లాడితే ఇంటికి వచ్చి మరీ గుణపాఠం చెబుతామని ఘాటుగా వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, మెట్టు సాయికుమార్ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. మహేశ్‌కుమార్ గౌడ్‌పై అరవింద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఎన్ఎస్‌యూఐ స్థాయి నుంచి కష్టపడి రాజకీయాల్లో ఎదిగిన బీసీ నాయకుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను విమర్శించే స్థాయి అరవింద్‌కు లేదని అనిల్‌కుమార్ యాదవ్ మండిపడ్డారు. తండ్రి పేరుతో రాజకీయాల్లోకి వచ్చిన అరవింద్.. స్వయంకృషితో ఎదిగిన నాయకుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేశారో చెప్పాలని అరవింద్‌ను కాంగ్రెస్ నేతలు నిలదీశారు. గల్ఫ్ బాధితుల సంక్షేమం కోసం ఎంపీగా ఆయన ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గల్ఫ్‌లో మరణించిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందిస్తుంటే అరవింద్ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. డీఎస్ కుటుంబానికి వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయో కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ అరవింద్ ఉపయోగిస్తున్న భాష ఎంపీ స్థాయికి తగినట్లుగా లేదని విమర్శించారు. దమ్ముంటే ఎంపీ పదవికి రాజీనామా చేసి కనీసం కౌన్సిలర్‌గా గెలిచి చూపాలని సవాల్ విసిరారు. మరోసారి హద్దులు దాటి మాట్లాడితే ఇంటికి వచ్చి మరీ గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం తమ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ నేతలు సూచించారు. వ్యక్తిగత దూషణలు, హద్దులు దాటిన వ్యాఖ్యలు కొనసాగితే కాంగ్రెస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని స్పష్టం చేశారు.

# ప్రాణమున్నంత వరకు బీఆర్ఎస్‌తో కలవను

- పార్టీతో మళ్లీ కలిసి పనిచేసే ప్రసక్తే లేదు
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత
- షోకాజు కూడా ఇవ్వకుండానే బయటకు పంపారని ఆవేదన
- కుటుంబ బంధాలు వేరు.. రాజకీయాలు వేరని స్పష్టీకరణ
- వచ్చే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తామని ధీమా
- బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో పోరాటం



**హైదరాబాద్, ఆగస్టు 16:** "ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేసే ప్రసక్తే లేదు. కుటుంబ సంబంధాలు వేరు.. రాజకీయాలు వేరు" అని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌తో రాజకీయంగా కలిసే అవకాశం లేదని తేల్చిచెప్పారు. అదే సమయంలో బీఆర్ఎస్‌ను అధికారంలోకి రాకుండా చేయడమే తమ రాజకీయ సిద్ధాంతం కాదని స్పష్టం చేశారు. ఓ మీడియా ఇంటర్వ్యూలో కవిత మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి తనను బయటకు పంపించిన తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం షోకాజు నోటీసు కూడా ఇవ్వకుండా పార్టీ నుంచి పంపించేశారని ఆరోపించారు. సస్పెన్షన్‌కు ఏడాది ముందు నుంచే తనను పార్టీలో పక్కన పెట్టారని పేర్కొన్నారు. అయినప్పటికీ నైతిక విలువలకు కట్టుబడి తానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్లు గుర్తుచేశారు. తన తండ్రి కేసీఆర్‌ను తాను ఎన్నడూ ఎదిరించలేదని చెప్పారు.

### 'మాది ఆర్ట్ మూవీ కాదు.. కమర్షియల్ మూవీ'

తాను ప్రారంభించిన కొత్త రాజకీయ ప్రయాణానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని కవిత తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "మాది ఆర్ట్ మూవీ కాదు.. కమర్షియల్ మూవీ. నేను గెలవకపోతే ఇంకెవరు గెలుస్తారో తెలియదు" అంటూ వ్యాఖ్యానించారు. తన తండ్రి కేసీఆర్ మాదిరిగానే తాను కూడా తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తానని చెప్పారు. కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం తాము పార్టీ పెట్టలేదని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే వంద రోజుల్లోనే 42 నియోజకవర్గాల్లో పార్టీ కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు.

### బీసీల కోసం ఢిల్లీ వరకు పోరాటం

సామాజిక న్యాయం, లౌకికవాదమే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని కవిత స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకులుగానే చూస్తున్నాయని ఆరోపించారు. బీసీల సంక్షేమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారని విమర్శించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు అవసరమైతే ఢిల్లీ వేదికగా పోరాటం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఆ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని కవిత జోస్యం చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు చోటుచేసుకుంటాయని, తమ పార్టీ కీలకశక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.



# రాజగోపాల్ వ్యాఖ్యల్లో తప్పు లేదు: అనిరుధ్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 15:** మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను సమర్థిస్తూ మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనే వ్యక్తి ఒక అగ్నిపర్వతం.. వోల్కానో.. ఆయనకు కోపమొచ్చిందంటే ఒక అగ్నిపర్వతం పేలినట్టు పేలుతది. ఆయన ఎప్పుడూ కూడా మంత్రి పదవి కావాలని కొట్లాడలేదు.. అడగలేదు.. రెండున్నర సంవత్సరాలు అయింది.. అయి ఉంటే అప్పుడే కొట్లాడుతుండే. ఆయన ప్రజల గురించి సమస్యల మీద అడుగుతుండు. రాజగోపాల్ రెడ్డి మాట్లాడే దాంట్లో తప్పేం లేదు. నేను కూడా సమస్యల గురించి చాలా సార్లు మాట్లాడాను. సమస్యలున్నాయి.. వాటిని పరిష్కరించుకుంటే మా పార్టీకే మంచి పేరొస్తది కదా..కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు రావాలని మాట్లాడిండు అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# బేవకూఫ్ ఇప్పుడే చెప్పిన కదా!

### జర్నలిస్టుపై నోరు పారేసుకున్న బీజేపీ ఎంపీ అర్వింద్

### వెంటనే క్షమాపణ చెప్పాలని టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 14:** విలేకరుల సమావేశంలో తనను ప్రశ్న అడిగిన జర్నలిస్టుపై నిజామాబాద్ బీజేపీ అర్వింద్ నోరు పారేసుకున్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనను ప్రశ్న అడిగిన జర్నలిస్టును ఉద్దేశించి 'బేవకూఫ్' ఇప్పుడే చెప్పిన కదా..! వినా లే..' అంటూ అహంకార ధోరణిలో వ్యాఖ్య లు చేశారు. జర్నలిస్టుపై ఎంపీ అర్వింద్ చేసి న వ్యాఖ్యల వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. జర్నలిస్టులు ఎంపీ అహంకార ధోరణిపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఎంపీ అర్వింద్ జర్నలిస్టుపై అసభ్యకరంగా చేసిన వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణ చెప్పాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇష్టానుసారం మాట్లాడటం సరికాదని మండిపడింది. ఫెడరేషన్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పీ రాంచందర్, ప్రధాన కార్యదర్శి బీ బసవపున్నయ్య ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టుపై చేసిన వ్యాఖ్యలను ఎంపీ అర్వింద్ వెంటనే ఉపసంహరించుకోవాలని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

# తెలంగాణపై ఏపీ నీటి కుట్రలు

### కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్‌కు లేఖ దుర్మార్గం

### మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్




**హైదరాబాద్, ఆగస్ట్ 15:** తెలంగాణ నీటిపై ఏపీ మళ్లీ కుట్రలు మొదలు పెట్టిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీ చైర్మన్ కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకి లేఖ రాశాడు. ఆయన వాళ్ల రాష్ట్రం గురించి మాట్లాడాలి కానీ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా రివర్ బేసిన్‌లో ఉన్న ప్రాంతానికి కేవలం 30 టీఎంసీల నీళ్లు మాత్రమే ఇవ్వాలని.. అంటే 30 శాతం మాత్రమే తెలంగాణకు ఇవ్వండి.. మిగితా నీళ్లు మేం తీసుకుపోతం. అంటే 146 టీఎంసీలు మేం తీసుకెళ్తం.. 30 టీఎంసీలు తెలంగాణ వాళ్లకు ఇచ్చేయండి అని.. ఆయన ఎవరు... తెలంగాణ గురించి రాయడానికి నీకు ఎవరు అధికారం ఇచ్చిండన్నారు. 100 శాతం కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాంతాన్ని వదిలిపెట్టి నువ్వు కృష్ణా బేసిన్ నుంచి పెన్నా బేసిన్‌కు కృష్ణా రివర్‌కు 80-90 శాతం నీళ్లు తీసుకుపోతున్నరు. పోతిరెడ్డి పాడు ద్వారా 10 వేల క్యూసెక్కులు అని చెనప్పి 30 వేల క్యూసెక్కుల నీళ్లు తీసుకెళ్లి ఆ ప్రాంతంలో నింపుకుంటున్నరని ఆరోపించారు. తెలంగాణకు ఎన్ని నీళ్లు ఇవ్వాలో డిసైడ్ చేయడానికి వాడు ఎవడు..? ఏపీ ఈఎన్‌సీ లేఖ రాసిన రోజే తెలంగాణ ఈఎన్‌సీ కూడా లేఖ రాశాడు. మాకు కృష్ణా నదిపై రిజర్వాయర్లు లేవు, నీటిని ఏపీకి ఇబ్బంది లేకుండా ఇవ్వాలని తెలంగాణ ఈఎన్‌సీ లేఖ రాశాడు.. ఏదుల, నార్లాపూర్ రిజర్వాయర్లు లేవా..? 10 ఏళ్లలో తెలంగాణ నీటిపై లేని కుట్రలు మళ్లీ ఎందుకు మొదలవుతున్నాయి..? తెలంగాణ ప్రభుత్వం చేతకానిది అనే కదా..? ఏపీ మోచేతి కింద బతుకుతుందనే కదా..? తెలంగాణకు అన్యాయం చేసే అధికారులను వదిలిపెట్టము, జాగ్రత్త అని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. తెలంగాణ ఈఎన్‌సీకి లేఖ రాయమని ఎవరు చెప్పారు..? రేవంత్ రెడ్డి చెప్పాడా..? అని అడిగారు.

# వెయ్యి కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి దొరకడు

### రాహుల్‌గాంధీ శ్రీరాముడైతే.. జగ్గారెడ్డి హనుమంతుడు

### ఓడినా ప్రజలను వీడని నాయకుడంటూ సీఎం రేవంత్ ప్రశంసలు



**సంగారెడ్డి, ఆగస్టు 15:** "వెయ్యి కోట్ల రూపాయలు ఇచ్చినా జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడు.. నాయకులకు మార్కులు వేస్తే నాకంటే ఆయనకే ఎక్కువ మార్కులు వస్తాయి" అంటూ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. ఎన్నికల్లో ఓడిపోయినా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి కోసం పనిచేస్తున్న జగ్గారెడ్డి వంటి నాయకుడిని ఓడించడం సంగారెడ్డి ప్రజల దురదృష్టమని వ్యాఖ్యానించారు. సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జగ్గారెడ్డితో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని శ్రీరాముడిగా భావిస్తే.. జగ్గారెడ్డి ఆయన వెంట నడిచే హనుమంతుడి వంటి వ్యక్తి అని అభివర్ణించారు. పార్టీ పట్ల ఆయనకున్న విధేయత, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతను కొనియాడారు. ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉండటమే నిజమైన నాయకుడి లక్షణమని సీఎం పేర్కొన్నారు. ఆ విషయంలో జగ్గారెడ్డి ముందుంటారని చెప్పారు. "కుటుంబాన్ని కూడా పక్కనపెట్టి ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తాడు. పరిస్థితులు ఎలా ఉన్నా జగ్గారెడ్డి ప్రజా జీవితంలో ఉండాల్సిందే" అని స్పష్టం చేశారు. జగ్గారెడ్డి ప్రజల సమస్యల విషయంలో వెనక్కి తగ్గే వ్యక్తి కాదని, ప్రజల కోసం ఎంతదూరమైనా వెళ్లే స్వభావం ఆయనదని రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. సంగారెడ్డి ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం రాజకీయాలకు అతీతమైనదని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ప్రజలకు దూరం కాకుండా అదే ఉత్సాహంతో పనిచేయడం ఆయన ప్రత్యేకతని సీఎం అన్నారు.

## సంపాదకీయం



# హుందాతనం కోల్పోతున్న రాహుల్ గాంధీ!

రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్షనేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారిపోయారు. మాటల్లో హుందాతనం లేదు. చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. లోక్‌సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు. ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధాన మంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు..ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరించిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతున్న వేళ..ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే..ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోడీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం. రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాలపైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పారాకాష్టగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జి అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్ధనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకు పోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది. తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేక పోతున్నారు. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే .. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు. 'ఓటు చోరీ'పై ఇలాగే చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రధాని కన్నా ఎక్కువ కష్టపడాలి. ఎక్కువగా కృషి చేయాలి. యూపీఏ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో రాహుల్ మంత్రిపదవిని చేపట్టేందుకు అంగీకరించలేదు. దీంతో ఆయనకు అధికారంలో ఉండడం ఎలా అన్నది కూడా తెలియదు. ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు మాత్రం ఎలా నమ్ముతారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని రాహుల్, ఇప్పటికీ పదేపదే అవే తప్పులు చేయడంతో పాటు, రాజకీయ హుందాను కోల్పోతున్నారు. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధాన మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా మరింతగా దిగజారిన నేతగా ప్రజల్లో చులకన భావం మూటకట్టుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తి నిజసానికి ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడు. ఇక ప్రధానిగా కావాలనుకంటున్న ఇతనికి వందిమాగధులు చేస్తున్న పొగడ్తలతో ఉబ్బిపోవడం తప్ప మరొటి తెలియడం లేదు. స్వయం ప్రకటితంగా ఇక తానే భావి ప్రధాని అనుకోవడంతో వచ్చిన మానసిక వైకల్యంగా చూడాలి. వీటిని అధిగమించితే తప్ప సమర్థనేతగా రాహుల్ రాణించడం కష్టం.

# వికసిత భారత్‌కు 'సప్తధార'!

- ప్రపంచ నాయకత్వమే భారత్ లక్ష్యం
- తయారీ నుంచి రక్షణ దాకా ఏడు రంగాలపై గురి
- యువశక్తి.. సాంకేతికతతో సరికొత్త ప్రగతి పథం
- జనగణనలో కచ్చితమైన సమాచారమివ్వాలని పిలుపు
- స్వయం సమృద్ధితో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్
- ఎర్రకోట నుంచి భవిష్యత్ భారతానికి మోదీ దిశానిర్దేశం





**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ప్రపంచస్థాయి నాయకత్వం వహించే శక్తి, సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తయారీ నుంచి వ్యవసాయం వరకు, సాంకేతికత నుంచి రక్షణ వరకు ప్రతి రంగంలోనూ ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి దేశాన్ని తీసుకెళ్లడమే లక్ష్యమని ప్రకటించారు. 2047 నాటికి సంపూర్ణ స్వయంసమృద్ధితో కూడిన 'వికసిత భారత్' నిర్మాణానికి 'సప్తధార' పేరుతో ఏడు కీలక రంగాల కార్యాచరణను దేశం ముందుంచారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై వరుసగా 13వసారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మోదీ జాతినుద్దేశించి ప్రసంగించారు. భారత్ ఇక చిన్న లక్ష్యాలతో సంతృప్తి చెందే దేశం కాదని, పెద్ద కలలు.. ఉన్నత లక్ష్యాలతో ప్రపంచానికి దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. దేశ యువతకు కృత్రిమ మేధ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు భారీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మోదీ ప్రకటించారు. కోటి మంది యువతకు కృత్రిమ మేధ నైపుణ్యాల్లో శిక్షణతో పాటు పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు యువతకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు.

### జనగణనకు ఓ గంట ఇవ్వండి

దేశంలో జరుగుతున్న జనగణనలో యువత చురుగ్గా భాగస్వాములు కావాలని ప్రధాని కోరారు. "దేశం కోసం ఒక గంట లేదా రెండు గంటలు కేటాయించండి. ప్రతి ఇంట్లో జనగణనపై అవగాహన కల్పించండి" అని పిలుపునిచ్చారు. జనగణన కేవలం జనాభా లెక్కల ప్రక్రియ కాదని, ప్రజలు ఇచ్చే సమాచారం ఆధారంగానే భవిష్యత్ జాతీయ విధానాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందుతాయని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ కచ్చితమైన సమాచారం ఇవ్వాలని కోరారు.

### దేశ ప్రగతికి ఏడు ధారలు

వికసిత భారత్ నిర్మాణానికి తయారీ, వ్యవసాయం–ఆహార భద్రత, సాంకేతికత–ఆవిష్కరణలు, మౌలిక వసతులు, రక్షణ, హరిత–నీలి ఆర్థిక వ్యవస్థ, భారతీయ సాంస్కృతిక ప్రభావం అనే ఏడు రంగాలను 'సప్తధార'గా ప్రధాని ప్రకటించారు. తయారీ రంగంలో కేవలం విడిభాగాల ఉత్పత్తికి పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తులను భారత్‌లోనే తయారు చేయాలని పిలుపునిచ్చారు. ధర, నాణ్యత, భారీ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలక భాగస్వామిగా ఎదగాలన్నారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడంతో పాటు దీర్ఘకాలిక ఆహార భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. సాంకేతిక రంగంలో డేటా కేంద్రాలు, రోబోటిక్స్, కృత్రిమ మేధ వంటి అత్యాధునిక రంగాల్లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించాలని మోదీ స్పష్టం చేశారు. డ్రోన్లు, ప్రతిదాడి డ్రోన్ వ్యవస్థలు సహా అత్యాధునిక రక్షణ సాంకేతికతలను దేశీయంగా అభివృద్ధి చేయాలని సూచించారు. దేశ భద్రతకు స్వయం సమృద్ధ రక్షణ వ్యవస్థ అత్యంత కీలకమన్నారు. హరిత ఇంధనం, అణు విద్యుత్, సౌరశక్తి, హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై భారత్ మరింత వేగంగా ముందుకు సాగుతుందని చెప్పారు. వంద గిగావాట్ల అణు ఇంధన సామర్థ్యాన్ని సాధించడం లక్ష్యమన్నారు.

### చిప్ నుంచి హైడ్రోజన్ రైలు వరకు

సాంకేతిక ప్రపంచంలో సెమీకండక్టర్ చిప్‌ల ప్రాధాన్యాన్ని భారత్ గుర్తించిందని మోదీ పేర్కొన్నారు. ఇప్పటికే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో మరిన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని, రైల్వే విద్యుదీకరణను వేగంగా విస్తరించామని తెలిపారు. దేశంలో 50 లక్షల ఇళ్లకు సౌర విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.

### 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు

తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధాని పేర్కొన్నారు. 140 కోట్ల మంది భారతీయులు ఒకే సంకల్పంతో ముందుకు సాగితే దేశ ప్రగతిని ఎవరూ అడ్డుకోలేరన్నారు. స్థానిక ఉత్పత్తులను ఆదరించడం ద్వారా స్వదేశీ తయారీకి మరింత బలం చేకూర్చాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి మహిళా ప్రాతినిధ్యానికి సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. రాజకీయ ఘనత ఎవరు తీసుకున్నా అభ్యంతరం లేదని, మహిళలకు తగిన ప్రాతినిధ్యం దక్కాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.

### ఎర్రకోటపై మువ్వన్నెల రెపరెపలు

అంతకుముందు రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళులర్పించిన ప్రధాని మోదీ ఎర్రకోటకు చేరుకుని గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాయుసేన హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై మోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం వరుసగా 13వసారి.


### వేడుకలకు రాహుల్, ఖర్గే దూరం

ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. గతంలో సీటింగ్, ఇతర ప్రొటోకాల్ అంశాలపై కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో వారి గైర్హాజరు మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది.

# పాక్ ఉగ్రవాద సంస్థతో లింకులు

## బెంగుళూరులో బెంగాల్ యువకుడి అరెస్ట్





**బెంగళూరు, ఆగస్ట్ 15:** బెంగళూరులో అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ 25 ఏళ్ల యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడికి ఉగ్రవాద సంస్థ తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర పరగణాల జిల్లాకు చెందిన అసఫుల్ మల్లిక్ బెంగళూరులోని జిగణి పారిశ్రామిక ప్రాంతంలోని ఓ సంస్థలో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నాడు. బొమ్మసంద్ర పారిశ్రామిక ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక వ్యక్తి అనుమానాస్పద కార్యకలాపాల గురించి పోలీసులకు సమాచారం అందింది. దీంతో మల్లిక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ÷ాకిస్థాన్ సైన్యం ముస్లింలపై దాడులకు పాల్పడుతోందనే భావనతో తాను ఆగ్రహానికి గురైనట్లు మల్లిక్ చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. అదే సమయంలో, ఇజ్రాయెల్–పాలస్తీనా వివాదంలో పాకిస్థాన్ వైఖరిపైనా అతడు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. భారతదేశంలో ముస్లింలకు ఇబ్బందులు ఎదురైతే ప్రతీకారం తీర్చుకోవాలని అతడిని ప్రేరేపించినట్లు కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ÷శిస్‌బుక్ ద్వారా అఎ÷–గానిస్థాన్‌కు చెందిన ఇమ్రాన్ హైదర్ అనే వ్యక్తితో మల్లిక్ పరిచయం పెంచుకున్నట్లు వెల్లడైంది. అఎ÷–గాన్‌కు చెందిన టీటీపీ ఉగ్రసంస్థ హ్యాండ్లర్లతో అతడు తరచూ సంప్రదింపులు జరుపుతున్నట్టు తేలింది. భారత్, పాకిస్థాన్‌లో దాడులకు వారు ప్రణాళికలు రచించినట్టు తెలుస్తోంది. అఎ÷–గాన్‌కు వెళ్లి ఉగ్రసంస్థలో చేరడానికి కూడా అతడు సిద్ధమవుతున్నట్టు పోలీసులు గుర్తించారు.



# టీహెచ్‌డీసీ సొరంగ ప్రమాదం

## ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య

**ఉత్తరాఖండ్:** చమోలి జిల్లా పిపల్‌కోటిలోని టీహెచ్‌డీసీ సొరంగంలో నిన్న (శుక్రవారం) భారీ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బిర్హి నది సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో నిర్మాణంలో ఉన్న సొరంగంలోకి పెద్దఎత్తున వరదనీరు, శిథిలాలు వచ్చి చేరాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారి కోసం సహాయక బృందాలను అధికారులు రంగంలోకి దించారు. నిన్నటి నుంచి భారీగా చేరిన నీరు, శిథిలాలను తొలగిస్తూ.. నేడు మరో మృతదేహాన్ని వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. మరోవైపు, శిథిలాల కింద చిక్కుకుపోయిన మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈరోజు ఉదయం స్పందించారు. టీహెచ్‌డీసీ సొరంగంలోకి అకస్మాత్తుగా శిథిలాలు, నీరు చేరడంతో విధుల్లో ఉన్న కార్మికులు చిక్కుకుపోయారని తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతిచెందగా.. చిక్కుకుపోయిన కార్మికుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వ జిల్లా యంత్రాంగంతో సహా అన్ని ఏజెన్సీలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, ఈ ప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని తెలుసుకునేందుకు సమగ్ర దర్యాప్తు జరుగుతోందని సీఎం పుష్కర్ సింగ్ ధామి చెప్పారు. ఏ నిర్మాణ ప్రాజెక్టులోనైనా పని చేసే సిబ్బంది భద్రతే తొలి ప్రాధాన్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారమే ఆదేశాలు జారీ చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కాగా, సొరంగం లోపల భారీగా చేరిన నీరు, బురద కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు చెబుతున్నారు.

# మండల నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ మండల కేంద్రంలో మండల నూతన పాత్రికేయ సంఘాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆకుల అశోక్, అధ్యక్షులుగా గాజుల శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా స్వామి గౌడ్, కార్యదర్శిగా రాథోడ్ సందీప్, ప్రధాన కార్యదర్శిగా అజర్, ప్రచార కార్యదర్శిగా పోతన్న, కోశాధికారిగా రాజు యాదవ్, గౌరవ సలహాదారులుగా శోభన్ రెడ్డి, ప్రమోద్, ఫసీయొద్దీన్, సృజన్ రెడ్డి, నారాయణ, రవి, నవీన్, సతీష్, సాయి, రామారావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ పాత్రికేయ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

# ఇచ్చోడలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అబ్జర్వర్, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడంతో పాటు ప్రజల మధ్య సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. యువత దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గం టీఆర్ఎస్ పార్టీ నాయకులు మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు వందనం

# జాతీయ జెండాను ఎగురవేసిన జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్




**ఉద్యమ కెరటం, సిరిసిల్ల :**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జాతీయ జెండాను శనివారం ఎగురవేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఎగురవేశారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం, జెడ్పీ కార్యాలయం ఆవరణలోనూ జెండాను ఎగురవేశారు. పలువురు విద్యార్థులకు నోట్ బుక్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, ఏఓ రాంరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# వడూర్ గ్రామంలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వడూర్ గ్రామంలో కొత్త డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, జిపిఓ అనుష్, రాములు, శంకర్, దశరథ్, నడిపన్నతదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఆహారభద్రత స్మార్ట్ రేషన్ కార్డు

- రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లాలో అర్హత కలిగిన ప్రతి రేషన్ కార్డు దారుడికి భద్రతతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె.హరిత, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్రే అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అలీబిల్ అహ్మద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అర్హులైన రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకుందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఈ కార్డు ద్వారా సరుకులు తీసుకోవాలని తెలిపారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆహార భద్రత స్మార్ట్ కార్డు లో క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 64 వేల 939 లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు అందిస్తున్న సన్నబియ్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి లబ్ధిదారుడు రేషన్ బియ్యం తీసుకోవాలని తెలిపారు. శాసనమండలి సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులతో ఎలాంటి అక్రమాలు జరగకుండా నివారించవచ్చని, ఈ కార్డు అనేక సంక్షేమ పథకాలకు ప్రామాణికమని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ రేషన్ కార్డుదారులందరికీ స్మార్ట్ కార్డులు అందించడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రతి కార్డుదారుడు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులు అందించాలని తెలిపారు. అనంతరం రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, తహసిల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, రేషన్ కార్డు లబ్ధిదారులు, డీలర్లు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు







**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు చేపట్టిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, జిల్లా కలెక్టర్ కె హరిత, జిల్లా ఎస్పీ నికిత పంత్ , ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కొవ లక్ష్మి, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

## ప్రత్యేక ఆకర్షణగా శకటాలు

వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా శకటాలను రూపొందించారు. వాటిని తిలకించిన ప్రజలు, విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు.

# మహనీయుల త్యాగాల ఫలితమే స్వతంత్ర భారతం

**ఉద్యమ కెరటం, మద్నూర్ :**



మద్నూర్ మండల పరిధిలోని చిన్న ఏక్లరా, అవాల్గావ్ తదితర గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచులు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గేయంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, వారి స్ఫూర్తితో భావితరాలలో దేశభక్తిని నింపాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ సూచించారు.ఈ సందర్భంగా చిన్న ఏక్లరా పాఠశాల అభివృద్ధికి ప్రతి సంవత్సరం రూ 5,000 ఆర్థిక సాయం అందిస్తామని సంగమేశ్వర్ ప్రకటించగా, పాఠశాల కమిటీ బాధ్యురాలిగా ఎం. పూజను ఎన్నుకున్నట్లు సర్పంచ్ మహాదరావు తెలిపారు. అవాల్గావ్ గ్రామంలో వివిధ శాఖల అధికారులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసిన ఈ వేడుకల్లో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రాణాలకు భరోసాగా 108 సేవలు

- డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న పైలెట్ కొండ్రు రవి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సకాలంలో వైద్య సహాయం అందించడంలో 108 సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో వేగంగా స్పందిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న వేంసూర్ 108 పైలెట్ కొండ్రు రవికి జిల్లా స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. శనివారం ఖమ్మంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఖమ్మం జిల్లాలో 108 అత్యవసర సేవల్లో పైలెట్గా అత్యుత్తమ సేవలు అందించినందుకు కొండ్రు రవికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో క్షణం ఆలస్యం కూడా ప్రాణాలపై ప్రభావం చూపే వేళ అప్రమత్తతతో వ్యవహరిస్తూ, బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించడంలో రవి చూపిన సేవాభావం, అంకితభావం, విధి నిర్వహణలో నిబద్ధతకు ఈ ప్రశంసా పత్రం గుర్తింపుగా నిలిచింది. కొండ్రు రవికి లభించిన ఈ గౌరవం పట్ల ఆయన స్వగ్రామమైన వేంసూర్ మండలం వెంకటాపురం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడే అత్యవసర సేవల్లో రవి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపు లభించడం గ్రామానికే గర్వకారణమని పేర్కొన్నారు. రవిని గ్రామ ప్రజలు అభినందిస్తూ, భవిష్యత్తులోనూ ఇదే అంకితభావంతో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 108 సర్వీస్ ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్, 108 సర్వీస్ జిల్లా మేనేజర్ ఆలేటి ప్రణయ్ కుమార్ కొండ్రు రవిని అభినందించారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో సేవలందించడంలో రవి చూపుతున్న నిబద్ధతకు ఈ పురస్కారం తగిన గుర్తింపని పేర్కొన్నారు.

# ఘనంగా సండ్ర వెంకట వీరయ్య జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్సీనియర్ నాయకులు సండ్ర వెంకట వీరయ్య జన్మదిన వేడుకలను సత్తుపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా సండ్ర వెంకట వీరయ్య క్యాంపు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అనంతరం మహిళా నాయకులు కేక్ కట్ చేసి సండ్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ర్యాలీగా సత్తుపల్లి బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని కేక్ కట్ చేశారు. అనంతరం సత్తుపల్లి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కొత్తూరు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు ఎన్టీఆర్ కాలనీ, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలోనూ అన్నదాన కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అన్నప్రసాదం అందించారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజలతో మమేకమై, పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తూ సత్తుపల్లి ప్రజల కోసం నిరంతరం పనిచేసిన సండ్ర వెంకట వీరయ్య నాయకత్వం వర్ధిల్లాలని బీఆర్ఎస్ శ్రేణులు ఆకాంక్షించాయి. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ మరింత కాలం ప్రజాసేవలో కొనసాగాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డ శంకరరావు, మోరంపూడి ప్రభాకర్, వీరపనేని బాబీ, షేక్ రఫీ, మల్లూరి అంకంరాజు, సత్తుపల్లి మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు, పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఎగురవేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన
- ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు పంపిణీ



శకటాలు, స్టాళ్ల ప్రదర్శన..

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల :** దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను వెల్లడించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల అధికారులు, పోలీస్, మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితె తదితరులు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

వ్యవసాయ, ఉద్యానవన శాఖ, చేనేత జౌళి శాఖ, మత్స్య శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, అగ్ని మాపక శాఖ, ఆర్టీసీ, గృహ నిర్మాణ శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, పౌర సరఫరాల, సర్వే అండ్ రెవెన్యూ శాఖ, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పనులు, వివరాలు, పథకాలతో రూపొందించిన శకటాలు ప్రదర్శించారు. అలాగే గ్రామీణ అభివృద్ధి శాఖ, వ్యవసాయ, ఉద్యానవన, పోలీస్ శాఖ, 17వ బెటాలియన్, అటవీ శాఖ, లీడ్ బ్యాంక్ తదితర శాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తదితరులతో కలిసి పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు, మంచి శకటాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, నగదు అందజేసి అభినందించారు.

**మహిళా సంఘాల సభ్యులకు ఈ స్కూటీ, ఈ ఆటోల పంపిణీ..**

స్త్రీ నిధి ద్వారా జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు ఈ స్కూటీ, ఈ ఆటోలను ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, ఎస్పీ మహేష్ బి.గీతే అతిథులతో కలిసి పంపిణీ చేశారు. రూ.14లక్షల 25వేల విలువైన ఈ స్కూటీలు, ఈ ఆటోలను 24 మందికి అందజేశారు.

**రూ.120 కోట్ల కు పైగా రుణాలు..**

855 మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు రూ.100 కోట్ల 12 లక్షలు, అలాగే 847 సంఘాలకు స్త్రీ నిధి రూ.20 కోట్ల 66 లక్షల రుణాలను పంపిణీ చేశారు. దీంతోపాటు టీవీ సీసీ స్కీమ్ కింద జిల్లాలోని పలువురు దివ్యాంగులకు ఆటో, హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్మెంట్ పంపిణీ చేశారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన దుంపేటి కుమార స్వామికి ఎలక్ట్రిక్ ఆటో, గుర్రంవాణిపల్లి కి చెందిన కంది తిరుమల్ రెడ్డి, ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన కొమిరే పరశురాముకు హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్మెంట్ ను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల , వేములవాడ మున్సిపల్ చైర్మన్లు జిందం కళ, పుల్కం రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల వేములవాడ ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కేవెస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఏఓ రాంరెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ నంబర్ ప్లే ట్ల తో తిరుగుతున్న ఇద్దరు నిందితుల అరెస్ట్

## వాహనాలు సీజ్

**ఉద్యమ కెరటం నేరడిగొండ:** మండల పరిధిలో పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో నకిలీ నంబర్ ప్లే ట్లు అమర్చి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఇద్దరు వేర్వేరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ సిహెచ్. రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ఇచ్చోడ వైపు వెళ్తున్న హీరో స్ప్లెండర్ ప్ల స్ బైక్‌ను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో ఇంజిన్, ఛాసిస్ నంబర్ల ఆధారంగా పరిశీలించగా, అసలు నంబర్ వేరేనని తేలింది. ఇచ్చోడలోని ఇస్లాంపుర కాలనీకి చెందిన షేక్ నజీర్ అనే వ్యక్తి నేరడిగొండకు చెందిన కలీమ్ వద్ద రూ.10వేలకు బైక్ కొనుగోలు చేసి, నకిలీ నంబర్ ప్లే ట్




అమర్చి తిరుగుతున్నట్లు విచారణలో అంగీకరించాడు. ఈ మేరకు నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అదేవిధంగా బోథ్ ఎక్స్ రోడ్డు వద్దే మరో ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా, పత్రాలు చూపకపోవడంతో అనుమానం వచ్చి ఇంజిన్, ఛాసిస్ నంబర్లను పరిశీలించారు. ఆ వాహనానికి నకిలీ నంబర్ ప్లేట్ అమర్చినట్లు గుర్తించారు. బోథ్ మండలం పొచ్చెర గ్రామానికి చెందిన కొండ రాజు అసలు రిజిస్ట్రేషన్ నంబర్‌ను దాచి పెట్టి, అధికారులను మోసం చేసే ఉద్దేశంతో నకిలీ నంబర్ ప్లేట్ వాడుతున్నట్లు తేలింది. దీంతో సుమోటోగా కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. చట్ట వ్యతిరేకంగా నకిలీ నంబర్ ప్లే ట్లువాడినా, సరైన పత్రాలు లేని వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం మండల ప్రజలు, అధికారులు ఘనంగా నిర్వహించారు. తాండూర్ ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి అంజయ్య ఎంపీడీఓ శ్రీనివాస్ తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే తాండూర్ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ యు.జ్యోత్స్న జాతీయ జెండాను ఆవిష్కరించారు. తాండూర్ మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ ముడిమడుగుల సురేష్ జాతీయ జెండాను ఎగురవేశారు. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల ఉన్నతాధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. దీంతోపాటు మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో సర్పంచులు జాతీయ జెండాలను ఆవిష్కరించగా, పంచాయితీ కార్యదర్శులు హాజరయ్యారు. తాండూర్ సహకార సంఘం కార్యాలయం వద్ద సహకార సంఘం అధ్యక్షులు ఎస్.దత్తు మూర్తి జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యా భారతి హైస్కూల్ విద్యార్థులు వివిధ వేషాధారణలో చేసిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో తాండూర్



మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఆర్ఎస్, బీజెపి, సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పాఠశాల డిజిటల్ విద్యకు సర్పంచ్ చేయూత

## 46 అంగుళాల టీవీ విరాళం

**ఉద్యమ కెరటం, తాండూర్:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మాధారం–3 ఇంక్లైన్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల డిజిటల్ విద్యాభివృద్ధికి సర్పంచ్ చందనాల రవి కుమార్ సహకారం అందించారు. పాఠశాలలో ఆధునిక విద్యాబోధనకు ఆయన సొంతంగా 46 అంగుళాల ఎల్ఈడీ టీవీని పాఠశాలకు బహూకరించారు. స్వాతంత్ర్య దినోత్సవ జెండా ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో సర్పంచ్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. డిజిటల్ కంటెంట్ ద్వారా పాఠ్యాంశాలను బోధించడంతో విద్యార్థులకు విషయాలు సులభంగా అర్థమవుతాయని, తద్వారా వారు ఉన్నత ఫలితాలు సాధించవచ్చని ఆకాంక్షించారు. గ్రామంలోని విద్యార్థుల భవిష్యత్తు కోసం సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు. అదేవిధంగా మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ మాట్లాడుతూ పాఠశాల యొక్క అభివృద్ధిని తెలుసుకొని, పాఠశాల సిబ్బంది పనితీరును తెలుసుకొని తనవంతు సహాయంగా పాఠశాలకు రూ.5వేల విరాళం ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించి టీవీని విరాళంగా అందించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గంధం లక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరికరం ద్వారా డిజిటల్ తరగతులు నిర్వహించి విద్యార్థులకు మరింత సమర్థవంతంగా బోధన అందిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్ల oపల్లిమార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరాజు, తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పట్టెం విష్ణు కళ్యాణ్, మాజీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, గ్రామ ఉప సర్పంచ్ చింత పూరి మల్లేశ్వరి, వార్డు సభ్యులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు రేణుకశ్రీ, శేఖర్, బానేష్, అంగన్వాడి, పాఠశాల ఉపాధ్యాయురాలు సువర్ణ, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# స్వాత్రంత్ర దినోత్సవ వేడుకల్లో బోరంచు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షబ్బీర్ అలి, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణలతో కలిసి పాల్గొన్న ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. షబ్బీర్ అలీ జాతీయ పథకాన్ని ఆవిష్కరించగా, వారితో కలిసి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను అతిథులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి సందర్శించారు. పలు రంగాల్లో ఉత్తమ సేవలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్ల ను ప్రధానం చేశారు.

# విధి నిర్వహణలో ప్రతిభకు గుర్తింపు

## గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్‌కు ప్రశంసా పత్రం



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చిన గంభీరావుపేట ఎస్సై సీహెచ్ శ్రీకాంత్‌కు ప్రశంసా పత్రం అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా శనివారం ఎస్సై శ్రీకాంత్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. పోలీసు విధుల్లో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు అందుబాటులో ఉండటం, సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం వంటి అంశాల్లో ప్రతిభ కనబర్చినందుకు ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎస్సై శ్రీకాంత్‌కు ప్రశంసా పత్రం అందడంతో గంభీరావుపేట మండలానికి చెందిన ప్రజలు, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో మరింత ఉత్సాహంతో పనిచేసి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను స్మరించుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా గ్రామాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. దేశభక్తి, ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని పలుచోట్ల 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడుతూ దేశభక్తి, జాతీయ ఐక్యత, ప్రజాసేవ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశ నిర్మాణంలో వారి సేవలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహనా కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి లో 6.360 కిలోల గంజాయి పట్టివేత

## ఇద్దరు నిందితులు అరెస్ట్

## కారు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.3లక్షలకు పైగా విలువైన 6 కేజీల 360 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో ఈగల్ టీమ్, సత్తుపల్లి పోలీస్ సిబ్బంది సంయుక్తంగా సత్తుపల్లిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కారులో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్‌కు చెందిన కామేష్ మారి, కారా రాజేంద్రగా గుర్తించారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నట్లు సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి తెలిపారు. నిందితులపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

# సేవా స్ఫూర్తి తో విద్యార్థులకు ఉచిత పాఠశాల సామగ్రి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ విశ్వ ధర్మక్షేత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బుగ్గపాడు గ్రామపంచాయతీ పరిధిలోని చంద్రాయపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠశాల బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ వెల్లటూరి ప్రసాదాచారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పాఠశాల సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బుగ్గపాడు గ్రామ సర్పంచ్ బొడ్డరోజా లక్ష్మీ, ట్రస్ట్ సభ్యులు తుమ్మూరి శ్రీనివాసరావు, బొడ్డు శివబాబు, శ్రీ విశ్వ ధర్మక్షేత్ర దేవాలయాల పాలకమండలి అధ్యక్షులు తుమ్మూరి ప్రసాద్ బాబు, కమిటీ సభ్యులు కేసరి కృష్ణ, బొడ్డు ఉమామహేశ్వర రావు, బోయినపల్లి నరేష్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ వివేక్, కొలూరి రామారావు, సత్తుపల్లి వాసవి మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ వారు తమ సహాయ సహకారాన్ని అందించారు. సేవే సమాజానికి బలం, విద్యే భవిష్యత్తుకు వెలుగు అనే స్ఫూర్తితో విద్యార్థులకు అండగా నిలవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.

# సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి



**ఉద్యమ కెరటం, మ ంచిర్యాల :** సమాజ సేవలో ప్రతిఒ క ్కరూ భాగ స్వామ ్యులు కావాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మంచిర్యాలలోని రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మందమర్రి, నస్పూర్ శాఖల సీనియర్ మేనేజర్లు రమేష్, భోగే సాగర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. రక్తదాన కార్యక్రమంలో ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పించడం జరిగిందని, ఈ రక్తదాన శిబిరంలో 23 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయ పడటంతో పాటు, విలువైన ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



**ఉద్యమ కెరటం, కౌటాల:** పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కౌటాల సీఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని గుండాయిపేట గ్రామంలో శనివారం అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టగా, సుమారు 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న శ్రీరామ్ కిషోర్ ను పట్టుకున్నట్లు వివరించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

# ఆదిలాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- **ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ (స్మార్ట్ రేషన్) కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కేవలం తెలంగాణలోనే తెల్ల రేషన్ కార్డులను ప్రభుత్వం అందిస్తోందని, ఈ ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆరు గ్యారంటీల అమలుతో ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో మొత్తం 2.26 లక్షల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దశల వారీగా చేపట్టామని, తొలి విడతలో అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆదిలాబాద్ జిల్లా రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని, ఎయిర్‌పోర్టు, రక్షణ అకాడమీలు, సైనిక పాఠశాలల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి జిల్లా సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం కూడా అర్హులైన పేదలను సంక్షేమ పథకాల నుంచి తొలగించే ఉద్దేశంతో పనిచేయదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్థికంగా స్థిరపడిన వారు స్వచ్ఛందంగా రేషన్ కార్డులను వదులుకుంటే నిజమైన పేదలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని సూచించారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేదల సంక్షేమం కోసం భారీగా సబ్సిడీ బియ్యం అందిస్తోందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో భాగంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 35వేలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో సుమారు 70వేల మందికి లబ్ధి చేకూరిందని తెలిపారు. లబ్ధిదారులకు నాణ్యమైన సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, కార్డుదారులు 'తెలంగాణ రేషన్' మొబైల్ యాప్ ద్వారా తమ వివరాలను తెలుసుకోవచ్చని చెప్పారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1983కు ముందే కిలో బియ్యాన్ని రూ.2కు అందించిన స్వర్గీయ నందమూరి తారక రామారావును ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ పథకానికి వేల కోట్ల రూపాయలు కేటాయిస్తోందని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులను వెంటనే భర్తీ చేసి యువతకు ఉపాధి కల్పించాలని, మారుమూల ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ రేషన్ కార్డు ప్రతి పేద కుటుంబానికి అత్యంత అవసరమైన పత్రంగా అభివర్ణించారు. ఇది నిరంతర ప్రక్రియ అని, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను అందరూ సమర్థించాలని అన్నారు. మారుమూల గ్రామాల్లో రేషన్ దుకాణాల దూరాన్ని తగ్గించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ప్రతి పేదవాడు మూడు పూటలా తిండి తినాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి దుర్వినియోగానికి తావివ్వకుండా బాధ్యతగా వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్.చిత్రు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డీఎస్ఓ నందిని, డిఎం సుధారాణి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి అంజయ్య తెలిపారు. శనివారం తాండూర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయం మేరకు ఇకపై మండల స్థాయిలోనే ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలను ఎక్కడికక్కడ వేగవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించిందన్నారు. ఇప్పటికే ప్రతి సోమవారం జిల్లా, డివిజన్ స్థాయిలో ప్రజావాణి కొనసాగుతుండగా, మండల స్థాయిలోనూ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే సోమవారం నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజావాణి కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరవుతారని, మండల స్థాయిలోనే ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అక్కడిక్కకడే పరిష్కరించేలా చర్యలు చేపడుతామన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని శాఖల ఉన్నతాధికారుల నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపి తగిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రజలకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు సమయం కూడా వృథా కాదన్నారు. మండల స్థాయి అధికారులు హాజరై అధికారుల సమక్షంలోనే సమస్యలకు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు.

# గంభీరావుపేటలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌తో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. స్థానిక గాంధీ చౌక్ వద్ద గ్రామ సర్పంచ్ మల్లుగారి పద్మ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అదేవిధంగా గంభీరావుపేట తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మారుతి రెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు సిబ్బందితో కలిసి జెండాకు వందనం చేశారు. వేడుకల సందర్భంగా జాతీయ జెండాలు, దేశభక్తి గీతాలతో గంభీరావుపేట మండల కేంద్రంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. పలుచోట్ల చిన్నారులు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాలతో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాలను గుర్తు చేసుకుంటూ దేశ ఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వాన్ని కాపాడుతూ అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది, యువత, మహిళలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఓ రామ్మోహన్‌రావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సర్తాజ్ పాషా, ఎంఆర్సీలో ఎంఈఓ సునీత, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బండారు ప్రవీణ్‌కుమార్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు సైతం పలు కార్యాలయాల్లో జెండాలను ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ గీతాలాపన నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక వేషధారణలతో మండల కేంద్రంలోని పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో విద్యార్థులు సందడి చేయడంతో జాతీయ స్ఫూర్తితో మార్మోగింది. పలు పాఠశాలల్లో దేశభక్తి గీతాలపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన సమరయోధుల సేవలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య పోరాట చరిత్రను నేటి యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రజలంతా ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# 108 సేవల్లో కృష్ణకు జిల్లా స్థాయి ప్రశంస



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** 108 అత్యవసర సేవల్లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ సేవలు అందించినందుకు సత్తుపల్లి 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) గొల్లమందల కృష్ణను ఘనంగా సన్మానించారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర చేతుల మీదుగా కృష్ణ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమయ స్ఫూర్తితో స్పందిస్తూ, బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించడంలో ఆయన చూపిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా గొల్లమందల కృష్ణను సత్తుపల్లి ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.సురేష్ నారాయణ, 108 సర్వీస్ ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్, 108 సర్వీస్ జిల్లా మేనేజర్ ఆలేటి ప్రణయ్ కుమార్ అభినందించారు. కృష్ణ అందిస్తున్న సేవలు 108 సిబ్బందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# కన్నుల పండుగగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహణ
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ






**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పట్టణంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వేడుకలకు వచ్చిన ప్రభుత్వ సలహాదారుకు జిల్లా అధికారులు పూలమొక్క అందించి ఘన స్వాగతం పలికారు. జాతీయ గీతం, రాష్ట్ర గీతాలాపన అనంతరం కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా అన్నివర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో ఆదిలాబాద్ జిల్లా పలు రంగాల్లో ముందంజలో నిలుస్తోందని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మరింత అంకితభావంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రభుత్వ సలహాదారు, జిల్లా కలెక్టర్, ఎస్పీలు కలిసి విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ కనబర్చిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయని, ప్రజాసేవలో ఇదే నిబద్ధత కొనసాగించాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రశంసా పత్రాలతో సత్కరించి అభినందించారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన అభివృద్ధి ప్రదర్శన స్టాళ్లను సందర్శించి పరిశీలించారు. పోలీస్ శాఖ నిర్వహించిన పరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, ఏఎస్పీలు మౌనిక, రుత్విక్ సాయి కోటే, డీఎఫ్‌ఓ చిన్న విశ్వనాథ్ భూసా రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాత్రంత్ర దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** 80వ స్వాత్రంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం మండల వ్యాప్తంగా మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎంఏ కలీమ్, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇంచార్జి ఎంపీడీఓ జీవన్ రెడ్డి, మండల ఆయా ప్రభుత్వ శాఖల వద్ద సంబందిత అధికారులు త్రివర్ణ పథకాన్ని ఎగురావేశారు. అదేవిధంగా ప్రైవేటు, ప్రభుత్వ పాతశాలల్లో విద్యార్థులు నిర్వహించిన ఉపన్యాస, నాటికలు చూరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ ల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండల కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జెండా వద్ద ఆ పార్టీ తాండూర్ మండల అధ్యక్షులు పెద్ద బోయిన శంకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్ మహేందర్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి.మురళీధర్ రావు, మాజీ జెడ్పీటీసీ ఎస్.బానయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రత్నాకర్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ మోమిన్ అలీ, నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ జెండా వద్ద బీఆర్ఎస్ తాండూర్ మండల కార్యదర్శి ఎస్.దత్తు మూర్తి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎలుక రామ్ చందర్, మసాడి శ్రీదేవి శ్రీరాములు, పూసల ప్రణయ్ కుమార్, గట్టు సంతోష్ కుమార్, బి.చంద్రశేఖర్, జాడి పోషం, పేర్క రాజన్న, నాయకులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ జెండా వద్ద తాండూర్ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హేమాజీ, జిల్లా కార్యదర్శి మహిధర్ గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయలు, సీనియర్ నాయకులు పులగం తిరుపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దం మల్లేష్ మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్ ఎస్సీ మోర్చా నాయకులు చిరంజీవి నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ఐబిలో తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఠాకూర్ ఉమ్ రావు సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామంలోని ప్రాణహిత భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు గౌరవ వందనం చేశారు. అనంతరం స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు. దేశభక్తి నినాదాలతో ప్రాణహిత భవన్ పరిసరాలు మార్మోగాయి.

# స్వాతంత్ర్య సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భారతదేశ స్వాతంత్ర్య సాధన కోసం అమరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లతో కలిసి వేణుగోపాల్ రావు పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతం, తెలంగాణ గీతాలాపనలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి సందేశాన్ని అందించారు. అనంతరం వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. జిల్లాలోని 892 స్వయం సహాయక సంఘాలకు రూ.100.10 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును మంచిర్యాల జిల్లా సమాఖ్య సభ్యులకు అందజేశారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద 18 మంది లబ్ధిదారులకు రూ.46,72,346 విలువైన చెక్కులను అందించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించాయి. వేడుకలకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల కోసం గ్యాలరీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను అధికారులు సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సమరయోధుల త్యాగాలతోనే స్వేచ్ఛ



**ఉద్యమ కెరటం, వాంకిడి:** స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని సరండి గ్రామంచాయతీ సర్పంచ్ బాపూజీ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం గ్రామపంచాయతీలో ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ మొహర్లే బాపూజీ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. స్వాతంత్ర్యాన్ని సాధించడం ఎంత గొప్ప విషయమో, దాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. దేశాభివృద్ధి కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని అన్నారు. గ్రామస్థాయిలో ఐక్యత, పరస్పర సహకారం, బాధ్యతాయుతమైన పాలనతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు పరిశుభ్రత, విద్య, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం చిన్నారులు, యువత, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. దేశభక్తి గీతాలు, జాతీయ నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాడి సోనం, జాడి రాజ్‌కుమార్, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు భద్రతతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు






**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత పారదర్శకంగా, అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ అందించేందుకు క్యూఆర్ కోడ్ భద్రతతో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్ తదితరులతో కలిసి హర్కర వేణుగోపాల్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని, అదే కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లాలో లబ్ధిదారులకు కార్డులు అందించడం ఆనందంగా ఉందన్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ప్రాథమిక సౌకర్యాల విషయంలో ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు కోటి స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నామని, ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందుతాయని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలులో స్మార్ట్ కార్డులు కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ క్యూఆర్ కోడ్‌తో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా జిల్లాలో తొలి విడతగా వంద మంది లబ్ధిదారులకు కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో కొత్తగా 40,456 రేషన్ కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు. రేషన్ కార్డుదారులకు ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నామని, రైతులు పండించిన సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగా అందుబాటులోకి వస్తాయని అన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అర్హులైన పేదలకు ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రభుత్వ పథకాలు అందించేందుకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలో మండలాల వారీగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు. రైతులు, మహిళలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ మినహా ఇతర కేటగిరీల పెన్షన్లకు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వేగంగా, పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులకు పారదర్శకంగా అందించడంలో స్మార్ట్ రేషన్ కార్డులు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సేవకు గౌరవం.. ప్రతిభకు గుర్తింపు

ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నవైద్య అధికారి ఉదయ్ కిరణ్



**ఉద్యమ కెరటం, జైనూర్:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని లింగాపూర్ మండల వైద్య అధికారి మలిడు ఉదయ్ కిరణ్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల అమలులో చూపుతున్న ప్రతిభ, అంకితభావాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చేతుల మీదుగా వైద్య అధికారి ఉదయ్ కిరణ్ ఉత్తమ సేవా పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. వైద్య రంగంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ, మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆయన చేస్తున్న కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్‌కు వైద్య సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# ఘనంగా మొదలెట్టిన టీమిండియా



- దేవదత్ పడిక్కల్ అజేయ శతకం
- రాహుల్, పడిక్కల్ ఆధిపత్యం..
- తొలి రోజు 2 వికెట్లకు 288 పరుగులు

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా ఘనంగా మొదలెట్టింది. గాలే వేదికగా శనివారం ప్రారంభమైన మ్యాచ్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో ఆధిపత్యం చెలాయించింది. దేవదత్ పడిక్కల్(178 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 131 బ్యాటింగ్) అజేయ శతకంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 73 ఓవర్లలో 2 వికెట్లకు 288 పరుగుల భారీ స్కోర్ చేసింది. దేవదత్ పడిక్కల్‌తో పాటు రిషభ్ పంత్(36 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. కేఎల్ రాహుల్( 162 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 77 రిటైర్డ్ హర్ట్) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. శ్రీలంక బౌలర్లలో ప్రబాత్ జయసూర్య ఒక వికెట్ తీసాడు. వర్షం అంతరాయం కారణంగా తొలి రోజు 77 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. సాధికారికంగా బ్యాటింగ్ చేసిన ఓపెనర్ యశస్వి జైస్వాల్(32) దురదృష్టకర రీతిలో రనౌటయ్యాడు. శ్రీలంక అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత తప్పిదంతో జైస్వాల్ బలయ్యాడు. కేఎల్ రాహుల్ ఆడిన బంతిని అడ్డుకోవడానికి కేశర డైవ్ చేయగా.. సింగిల్‌కు ప్రయత్నించిన జైస్వాల్ అతన్ని తాకి కిందపడిపోయాడు. అప్పటికే కేఎల్ రాహుల్ నాన్‌స్ట్రైక్ ఎండ్‌కు రాగా.. జైస్వాల్ కూడా యూటర్న్ తీసుకున్నాడు. దాంతో రనౌట్‌గా వెనుదిరిగాల్సి వచ్చింది. క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్‌తో కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ జోడీ ఆచితూచి ఆడటంతో టీమిండియా 27 ఓవర్లలో 101/1 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఇదే సమయంలో వర్షం రావడంతో గంటన్నర తర్వాత రెండో సెషన్ మొదలైంది. రాహుల్, పడిక్కల్ తమ జోరును కొనసాగించారు. తమకే సాధ్యమైన షాట్లతో శ్రీలంక బౌలర్లపై ఆధిపత్యం చెలాయించారు. రాహుల్ కాస్త నిదానంగా ఆడినా.. పడిక్కల్ వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలించాడు. ఈ క్రమంలో అతను 81 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కేఎల్ రాహుల్ 127 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. దాంతో టీమిండియా 197/1 స్కోర్‌తో టీ బ్రేక్ వెళ్లింది.

ఆఖరి సెషన్‌లో కేఎల్ రాహుల్ బ్యాటింగ్ కొనసాగించలేకపోయాడు. చేతి, కాలి కండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. క్రీజులోకి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రాగా.. కేశర నువంత బౌలింగ్‌లో క్విక్ సింగిల్ తీసి పడిక్కల్ 134 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. పడిక్కల్‌కు ఇదే తొలి టెస్ట్ సెంచరీ కావడం గమనార్హం. తన మూడో టెస్ట్‌లోనూ ఈ ఫీట్ సాధించాడు. మరోవైపు శుభ్‌మన్ గిల్(16) నిరాశపర్చాడు. ప్రబాత్ జయసూర్య బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి పంత్ రాగా.. వర్షం అంతరాయం కలిగించింది. కాసేపటి తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. పంత్(27 బ్యాటింగ్), పడిక్కల్ దూకుడుగా ఆడారు. అజేయంగా 52 పరుగులు జోడించి తొలి రోజు ఆటను ముగించారు.

కాగా.. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్ తన చారిత్రక 600వ టెస్ట్ మ్యాచ్ ఆడుతుండగా ఈ విచిత్రమైన రనౌట్ నమోదు కావడం విశేషం. రెండు మ్యాచ్‌ల ఈ టెస్టు సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. 2027 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవడానికి ఇరు జట్లకు ఈ సిరీస్ పాయింట్లు ఎంతో కీలకం. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉండగా, శ్రీలంక ఆరో స్థానంలో కొనసాగుతోంది.

# నిరాశగా వెనుదిరిగిన జైస్వాల్




సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌తో సరైన సమన్వయం లోపించడంతో ఇద్దరు భారత బ్యాటర్లు ఒకే ఎండ్‌కు (క్రీజులోకి) చేరడం, చివరకు జైస్వాల్ తన వికెట్‌ను సమర్పించుకోవడం మ్యాచ్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భారత ఇన్నింగ్స్ కొనసాగుతున్న సమయంలో శ్రీలంక స్పిన్నర్ కేశర నువాంత వేసిన ఫ్లైటెడ్ డెలివరీని కేఎల్ రాహుల్ మిడ్-ఆన్ దిశగా చక్కగా డ్రైవ్ చేశాడు. బంతిని ఆపేందుకు బౌలర్ నువాంత డైవ్ చేసినప్పటికీ బంతి అతడి చేతికి చిక్కకుండా ముందుకు వెళ్లింది. అయితే అదే సమయంలో నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్‌ను బౌలర్ ఢీకొట్టాడు. దీంతో అదుపు తప్పిన జైస్వాల్ పిచ్‌పై కిందపడిపోయాడు. మరోవైపు, షాట్ కొట్టిన వెంటనే సింగిల్ కోసం పరుగు తీసిన కేఎల్ రాహుల్ అప్పటికే పిచ్ మధ్యలోకి చేరుకున్నాడు. నాన్-స్ట్రైకర్‌గా ఉన్న జైస్వాల్ కింద పడిపోవడం చూసి రాహుల్ ఒక్కసారిగా తన పరుగును నిలిపివేశాడు. కానీ, వెంటనే తేరుకుని పైకి లేచిన జైస్వాల్.. పరుగు పూర్తి చేయాలనే ఉద్దేశంతో ముందుకు అడుగు వేశాడు. ఆ తర్వాత వెంటనే జైస్వాల్ తన మనసు మార్చుకుని వెనక్కి తిరిగి బౌలర్ వైపు ఉన్న క్రీజులోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే జైస్వాల్ ముందుకు రావడాన్ని పరుగు పూర్తి చేయమనే సంకేతంగా భావించిన కేఎల్ రాహుల్ వేగంగా నాన్-స్ట్రైకర్ ఎండ్‌కు చేరుకున్నాడు. చివరకు ఇద్దరు బ్యాటర్లు ఒకే వైపు ఉన్న క్రీజులోకి పరుగులు తీశారు. జైస్వాల్ కంటే ముందే రాహుల్ తన బ్యాట్‌ను క్రీజులో ఉంచడంతో జైస్వాల్ క్రీజు బయటే మిగిలిపోయాడు. శ్రీలంక ఫీల్డర్ ప్రభాత్ జయసూర్య విసిరిన బంతిని అందుకున్న వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లా ప్రారంభంలో బెయిల్స్‌ను పడగొట్టలేదు. స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కెప్టెన్ ధనంజయ డి సిల్వా వైపు చూస్తూ.. రనౌట్ చేయవచ్చా లేదా అని అడిగాడు. బ్యాటర్లు ఢీకొనడం వల్ల ఇది జరిగిందా క్రీడాస్ఫూర్తి పాటించాలా అనే సందిగ్ధత వారిలో కనిపించింది. అయితే బెయిల్స్ తొలగించడంలో ఎలాంటి ఇబ్బంది లేదని కెప్టెన్ ధనంజయ డి సిల్వా సంకేతం ఇవ్వడంతో డిక్వెల్లా వెంటనే స్టంప్స్‌ను పడగొట్టాడు. అనంతరం శ్రీలంక జట్టు రనౌట్ అప్పీల్‌ను ఉపసంహరించుకుందా లేదా అనే విషయాన్ని ఫీల్డ్ అంపైర్లు నిర్ధారించుకున్న తర్వాత జైస్వాల్‌ను రనౌట్‌గా ప్రకటించారు. దీంతో 37 బంతుల్లో 5 ఫోర్ల సాయంతో 32 పరుగులు చేసిన జైస్వాల్ నిరాశగా వెనుదిరిగాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో యశస్వి జైస్వాల్ రనౌట్ కావడం ఇది మూడోసారి కావడం గమనార్హం. గతంలో 2024లో మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 82 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. గతేడాది ఢిల్లీలో వెస్టిండీస్‌పై 175 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడిన సందర్భంలోనూ రనౌట్‌గానే వెనుదిరిగాడు. ఇప్పుడు మరోసారి గాలేలో దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు.

# హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు శుభారంభం

- తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై భారత్ ఘన విజయం
- తొలి క్వార్టర్‌లోనే భారత్‌కు పెనాల్టీ కార్నర్



నెదర్లాండ్స్‌లో జరుగుతున్న హాకీ ప్రపంచకప్‌లో భారత పురుషుల జట్టు శుభారంభం చేసింది. పూల్-డిలో భాగంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై భారత్ 3-1 తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందించాడు. హర్మన్‌ప్రీత్ రెండు గోల్స్ చేయగా సంజయ్ ఒక గోల్ సాధించాడు. మ్యాచ్ చివరి దశలో వేల్స్ ఒక గోల్ చేసినా అప్పటికే భారత్ తిరుగులేని ఆధిక్యంలో ఉండటంతో విజయానికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. మ్యాచ్ ప్రారంభం నుంచే భారత ఆటగాళ్లు దూకుడుగా ఆడారు. తొలి క్వార్టర్‌లోనే భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. ఏడో నిమిషంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న సంజయ్ అద్భుతమైన డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్ చేశాడు. వేల్స్ గోల్‌కీపర్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా బంతిని నెట్‌లోకి పంపాడు. దీంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత కూడా భారత జట్టు ఒత్తిడి కొనసాగించింది. మరో పెనాల్టీ కార్నర్‌ను భారత్ దక్కించుకోగా, ఈసారి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తన సత్తా చాటాడు. అద్భుతమైన షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్ ఎడమ వైపునకు పంపాడు. దీంతో తొలి క్వార్టర్‌లోనే భారత్ 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. మొదటి 15 నిమిషాల్లోనే భారత ఆటగాళ్లు ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. రెండో క్వార్టర్‌లో వేల్స్ కొంత మెరుగ్గా రక్షణాత్మకంగా ఆడింది. భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించినప్పటికీ దానిని గోల్‌గా మలచలేకపోయింది. బంతిని అందుకునే సమయంలో చిన్న పొరపాటు జరగడంతో భారత అవకాశాన్ని కోల్పోయింది. మరో పెనాల్టీ కార్నర్‌లో హర్మన్‌ప్రీత్ చేసిన ప్రయత్నం కూడా లక్ష్యాన్ని చేరలేదు. ఈ క్వార్టర్‌లో ఇరు జట్లూ గోల్ చేయలేకపోయాయి. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో భారత ఆటగాళు మరింత నియంత్రణతో ఆడారు. ఓపెన్ ప్లేలో కూడా అవకాశాలను సృష్టిస్తూ ప్రత్యర్థి డిఫెన్స్‌పై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి తన డ్రాగ్‌ఫ్లిక్‌తో మెరిశాడు. బంతిని నేరుగా గోల్‌పోస్ట్‌లోకి పంపి భారత్ ఆధిక్యాన్ని 3-0కు పెంచాడు. హర్మన్‌ప్రీత్‌కు ఇది మ్యాచ్‌లో రెండో గోల్.మూడో క్వార్టర్‌లో ఇరు జట్ల నుంచి పెద్దగా గోల్ అవకాశాలు కనిపించలేదు. అయితే 3-0 ఆధిక్యంతో ఉన్న భారత్ మ్యాచ్‌పై పూర్తిగా పట్టు సాధించింది. చివరి క్వార్టర్‌లో వేల్స్ కనీసం ఒక గోల్ చేసి లోటును తగ్గించాలని ప్రయత్నించింది. భారత గోల్‌కీపర్ మోహిత్ కీలక సమయంలో అద్భుతమైన సేవ్ చేశాడు. వేల్స్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను సమర్థంగా అడ్డుకుని భారత ఆధిక్యాన్ని కాపాడాడు. అయితే మ్యాచ్ ముగిసే సమయంలో వేల్స్‌కు ఓ గోల్ దక్కింది. భారత గోల్‌పోస్ట్ ముందు తీవ్ర గందరగోళం నెలకొన్న సమయంలో సామ్ వెల్ష్ బంతిని గోల్‌లైన్ దాటించాడు. వీడియో అంపైర్ పరిశీలన తర్వాత గోల్‌ను చెల్లుబాటు అయ్యేదిగా ప్రకటించారు. దీంతో వేల్స్ 1-3తో లోటును తగ్గించింది. ఆ తర్వాత భారత్ ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది. ‘మ్యాచ్‌లో భారత్‌కు మొత్తం ఐదు పెనాల్టీ కార్నర్లు లభించగా, వాటిలో మూడు గోల్స్‌గా మారడం జట్టు బలాన్ని చాటింది. మరోవైపు, డిఫెన్స్‌లోనూ భారత్ మెరుగైన ప్రదర్శన చేసింది. ప్రత్యర్థికి అవకాశాలు వచ్చినప్పుడు గోల్‌కీపర్ మోహిత్‌తో పాటు డిఫెండర్లు సమర్థంగా అడ్డుకున్నారు. ప్రపంచకప్‌లో భారత జట్టు ఈసారి పతకంపై గురిపెట్టింది. గతంలో ప్రపంచకప్‌లో భారత్ మూడు పతకాలు సాధించగా 1975లో మాత్రమే స్వర్ణ పతకం గెలిచింది. ఈసారి పతక కరవును ముగించాలనే పట్టుదలతో జట్టు బరిలోకి దిగింది. టోర్నీకి ముందు ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో జర్మనీ, నెదర్లాండ్స్ వంటి బలమైన జట్లపై భారత్ మంచి విజయాలు సాధించింది. పాకిస్థాన్‌ను రెండుసార్లు ఓడించడంతో పాటు ఇంగ్లాండ్‌పైనా విజయం సాధించింది. ప్రపంచకప్‌లో భారత్ పూల్-డిలో ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్‌తో కలిసి ఉంది. తొలి మ్యాచ్‌లో వేల్స్‌ను ఓడించిన భారత్, తదుపరి మ్యాచ్‌లో ఆగస్టు 17న ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఆ తర్వాత ఆగస్టు 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడనుంది. ఈసారి ప్రపంచకప్‌లో సంప్రదాయ క్వార్టర్‌ఫైనల్ విధానం ఉండదు. తొలి దశలో ప్రతి పూల్‌లోని టాప్-2 జట్లు తదుపరి దశకు చేరతాయి. అక్కడి నుంచి సెమీఫైనల్ బెర్తులు ఖరారవుతాయి. దీంతో ప్రతి మ్యాచ్‌లో సాధించే విజయం భారత్‌కు కీలకంగా మారింది.



# విజయం దిశగా బంగ్లాదేశ్

### తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సమష్టి ప్రదర్శన

### గ్రీన్, అలెక్స్ క్యారీపైనే ఆసీస్ ఆశలు

ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్ విజయం దిశగా సాగుతోంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా డార్విన్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 161 పరుగులు చేసింది. క్రీజులో కామెరూన్ గ్రీన్(43 బ్యాటింగ్)తో పాటు అలెక్స్ క్యారీ(19 నాటౌట్) ఉన్నాడు. ట్రావిస్ హెడ్(17), జేక్ వెదరాల్డ్(0) మరోసారి విఫలమవ్వగా.. మార్నస్ లబుషేన్(31), స్టీవ్ స్మిత్(44) కీలక భాగస్వామ్యాన్ని అందించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహ్మూద్(2/33) రెండు వికెట్లు తీయగా.. తైజుల్ ఇస్లామ్, మెహ్‌ది హసన్ మీరాజ్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 351/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 138 ఓవర్లలో 426 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ మెహ్‌దీ హసన్(154 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 65) హాఫ్ సెంచరీతో రాణించాడు. తంజీద్ హసన్(197 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 101) సెంచరీతో.. నజ్ముల్ హొస్సేన్ షాంటో(126 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 84) హాఫ్ సెంచరీతో చెలరేగిన సంగతి తెలిసిందే. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్(6/89) ఆరు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్(2/79) రెండు వికెట్లు పడగొట్టాడు. ప్యాట్ కమిన్స్, నాథన్ లయన్ తలో వికెట్ తీసారు. దాంతో బంగ్లాదేశ్‌కు 228 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్.. అదే తడబాటు కొనసాగించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(17), జేక్ వెదరాల్డ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. ఈ క్రమంలో లబుషేన్, స్మిత్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. లబుషేన్‌ను తైజుల్ ఇస్లామ్ ఔట్ చేయగా.. స్మిత్‌ను మెహ్‌దీ హసన్ మిరాజ్ పెవిలియన్ చేర్చి హాఫ్ సెంచరీని అడ్డుకున్నాడు. కామెరూన్ గ్రీన్(43 బ్యాటింగ్), అలెక్స్ క్యారీ(19 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా మూడో రోజు ఆటను ముగించారు. ఈ ఇద్దరి ప్రదర్శనపైనే ఆసీస్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ఇద్దరూ సెంచరీలతో చెలరేగి భారీ లక్ష్యం నమోదు చేస్తే తప్పా ఈ మ్యాచ్‌లో ఆసీస్ గట్టెక్కలేదు. నాలుగో రోజు ఆటలో బంగ్లాదేశ్ బౌలర్లు చెలరేగిన ఆసీస్‌ను త్వరగా ఆలౌట్ చేస్తే బంగ్లాదేశ్ విజయం సులువు అవుతుంది. ప్రస్తుతం ఆసీస్ ఇంకా 67 పరుగుల వెనుకంజలో ఉంది. లక్ష్యం 200 ధాటకుండా చూసుకుంటే బంగ్లాదేశ్ చారిత్రాత్మక విజయం సాధ్యమవుతోంది. ఆసీస్‌పై బంగ్లాదేశ్ ఇప్పటి వరకు టెస్ట్ మ్యాచ్ గెలవలేదు. 23 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్ ఆడుతోంది.

# 19 ఏళ్లకే మృత్యుఒడికి..

### ట్రాక్‌పై యువ సైక్లిస్ట్ దుర్మరణం..!

సైకిల్ ట్రాక్‌పై జరిగిన ప్రమాదం ఓ యువ సైక్లిస్ట్‌ను బలిగొన్నది. ఈ విషాదకరమైన ఘటనలో బ్రిటన్‌కు చెందిన 19 ఏళ్ల ఫిన్లే టార్లింగ్ దుర్మరణం చెందాడు. వొల్టా ఏ పోర్చుగల్ ఈవెంట్లో ఎనిమిదో దశలో ఫిన్లే ఉండగా.. హఠాత్తుగా ఓ వాహనం ట్రాక్ మీదకు దూసుకొచ్చింది. వ్యతిరేక దిశలో వచ్చిన ఆ ట్రక్ సైక్లిస్ట్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రమైన గాయాలతో అతడు మరణించాడు. ప్రతిభావంతుడైన ఫిన్లే మృతిపట్ల ప్రపంచవ్యాప్తంగా సైక్లిస్ట్‌లు సంతాపం ప్రకటించారు. చిన్న వయసులోనే టైమ్ ట్రయల్స్‌లో ఆరితేరిన ఫిన్లే టార్లింగ్ సైకిల్ ట్రాక్ మీదే ప్రాణాలు వదిలాడు. వొల్టా ఏ పోర్చుగల్ ఎనిమిదో దశలో ఉండగా.. అతడిని ఓ వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో అతడు మరణించాడు. దాంతో, నిర్వాహకులు వెంటనే పోటీని నిలిపివేశారు. సైక్లింగ్‌లో ఉజ్వలమైన భవిష్యత్ ఉన్న ఫిన్లే మృతితో ప్రపంచంలోని సైక్లిస్ట్‌లు విచారం వ్యక్తం చేశారు. ఈరోజు వొల్టా పోర్చుగల్‌లో ఫిన్లే టారింగ్ మరణించాడనే విషయాన్ని బద్ధలైన హృదయంతో మీకు తెలియజేస్తున్నాం. మా టీమ్‌లోని ప్రియమైన సభ్యుడు ఫిన్. ముఖ్యంగా అతడు చాలామందికి బిడ్డలాంటివాడు. సోదరుడే కాదు పలువురికి అతడు స్నేహితుడితో సమానం. అతడిని మేమెంతో మిస్సవుతాం' అని ఫిన్లే ప్రతినిధ్యం వహిస్తున్న ఎన్ఎస్ఎన్ డెవలప్‌మెంట్ టీమ్ వెల్లడించింది. ఫిన్లే ఈ లోకాన్ని వదిలి వెళ్లడం పట్ల టోర్నీ నిర్వాహకులు, పోర్చగీస్ సైక్లింగ్ సమాఖ్య అతడి కుటుంబసభ్యులకు ప్రగాఢమైన సానుభూతి తెలియజేశారు.






# ఓటిటి బాటపట్టిన చెన్నై లవ్ స్టోరీ

కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' ఓటిటి బాట పట్టింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి యూత్‌కు కనెక్ట్ అయింది. ఇప్పుడీ ప్రేమకథ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా ఆగస్టు 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు సంస్థ అధికారికంగా తెలిపింది. కథేంటంటే..: నివి (శ్రీ గౌరీ ప్రియ) తను ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)తో కలిసి పెళ్లికి సిద్ధమవుతుంది. కానీ, తీరా ముహూర్త సమయానికి పెళ్లి పీటలెక్కాల్సిన ఆ కుర్రాడు తాను మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి.. బ్రేకప్ చెప్పి వెళ్లిపోతాడు. ఆమెని ఆ బాధ నుంచి బయట పడేసేందుకు మిత్రులు చెన్నైకి తీసుకెళ్లినా ఏ మార్పూ రాదు. పైగా ప్రేమ విఫలమైన బాధలో దేవదాసులా మందుకు బానిసవుతుంది. అలాంటి సమయంలో ఆమె ఉంటున్న ఇంట్లోకి స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) అడుగు పెడతాడు. అతనొక అనాథ. దర్శకుడవ్వాలన్న ఆశతో చెన్నైలోకి అడుగు పెట్టిన అతనికి.. నివి ఫ్రెండ్స్ గ్యాంగే ఆశ్రయమిస్తారు. మొదట్లో స్టీవెన్ చేసే పనులు నివికి చిరాకు తెప్పించినా.. క్రమంగా అతని మాటలు, చేతలు తనలో మార్పు తెస్తాయి. ఈ క్రమంలోనే బ్రేకప్ బాధ నుంచి బయటపడి.. స్టీవెన్‌కి దగ్గరవుతుంది. మళ్లీ ఆమెలో ప్రేమ చిగురిస్తుంది. మరి ఆ తర్వాత వాళ్లిద్దరి ప్రయాణం ఎలా సాగిందనేది కథ.

# డిసి సక్సెస్‌తో మైత్రీమూవీ మేకర్స్ విజయోత్సవ వేడుక

టాలెంటెడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డిసి' చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుని దూసుకుపోతోంది. ఈ సినిమా సాధించిన సంచలన విజయంతో చిత్ర పరిశ్రమలో ప్రశంసల జల్లు కురుస్తోంది. అయితే ఈ సినిమా సాధించిన సక్సెస్ నేపథ్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'ఎఎ23' టీమ్ మరియు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అధినేతలు డైరెక్టర్ లోకేష్ కనగరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 'డిసి' మూవీ బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను మైత్రి మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. 'డిసి చిత్రానికి అఖండ విజయం అందించినందుకు అభినందనలు లోకేష్ కనగరాజ్. ఇప్పుడు ఎఎ23 వంతు! అంటూ మైత్రీ రాసుకొచ్చింది. ప్రస్తుతం డీసీ సక్సెస్ మూడ్‌లో ఉన్న లోకీ త్వరలోనే 'ఎఎ23' ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించబోతున్నాడు.





# సమిష్టి కృషితోనే అభివృద్ధి

## ఆసిఫాబాద్ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డా. బండ ప్రకాశ్
- వైభవంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డా. బండ ప్రకాశ్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన వేడుకల్లో ఆయన జిల్లా కలెక్టర్ కె హరిత, జిల్లా ఎస్పీ నీతిక పంత్, శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డె అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, ఏ ఎం సీ చైర్మన్ మంగ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అలీ బిల్ అహ్మద్,జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య లతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరంలో ప్రాణత్యాగం చేసిన మహనీయులను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్‌తో పాటు జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన అమరవీరుడు కొమురం భీంను స్మరించి నివాళులర్పించారు.

### మహిళలకు ఉచిత ప్రయాణం

మహిళా పథకం ద్వారా మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 2 కోట్ల 41 లక్షల మంది మహిళా ప్రయాణికులకు రూ.88.05 కోట్ల మేర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఎల్‌పీజీ రాయితీ పథకం కింద జిల్లాలో 78,467 కుటుంబాలకు రూ.500కే రాయితీ సిలిండర్ అందిస్తున్నామని, ఇప్పటి వరకు రూ.8.32 కోట్ల రాయితీని అందించినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ జిల్లాలో 83,684 కుటుంబాలకు రూ.55.53 కోట్ల రాయితీ కల్పించినట్లు పేర్కొన్నారు.

### ఆరోగ్యశ్రీతో పేదలకు మెరుగైన వైద్యం

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ప్రభుత్వం వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందన్నారు. 2025-26లో జిల్లాలో 8,396 మంది పేదలకు వైద్య చికిత్సలు అందించి రూ.21.99 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు.



### రైతులకు అండగా ప్రభుత్వం

రైతు భరోసా పథకం ద్వారా జిల్లాలో 2025-26 వానాకాలంలో 1,33,860 మంది రైతులకు రూ.250.30 కోట్ల రైతు భరోసా అందించినట్లు తెలిపారు. రైతు భీమా పథకంలో 2025-26 సంవత్సరంలో జిల్లాలో 74,567 మంది రైతులను నమోదు చేసి, ఇప్పటి వరకు 470 మంది రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.23.50 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి అవసరమైన సాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వివిధ సాగునీటి, మిషన్ భగీరథ, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలను కూడా ఆయన వివరించారు.

### విద్య, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యం

విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, విద్యా సంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు తదితర పథకాల ద్వారా ప్రభుత్వం సహాయం అందిస్తోందన్నారు. జిల్లాలోని వివిధ వర్గాల విద్యార్థులు, పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

### మౌలిక వసతుల అభివృద్ధి

జిల్లాలో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, పాఠశాలలు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని డా. బండ ప్రకాశ్ తెలిపారు. మహిళా శక్తి, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాలు, ఉపాధి కల్పన, పేదల సంక్షేమం తదితర రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# జర్నలిస్ట్ తుకారామ్ కుటుంబానికి అండగా ఉంటాం

### టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్

### జర్నలిస్ట్ ఆత్రం తుకారామ్ భౌతికకాయానికి ఘన నివాళి

**ఉద్యమ కెరటం: జైనూర్ :** కేరమెరి మండల సీనియర్ ఆదివాసీ జర్నలిస్ట్, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ఆత్రం తుకారామ్ అకాల మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే - ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. శుక్రవారం రాత్రి తుకారామ్ హఠాన్మరణం చెందిన విషయం తెలుసుకున్న ఆయన, సంఘం నాయకులతో కలిసి సిర్పూర్ (యు) మండల కేంద్రంలోని తుకారామ్ నివాసానికి శనివారం వెళ్లారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుకారామ్ కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, టీయూడబ్ల్యూజే (ఐజేయూ ) ఎల్లప్పుడూ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ప్రజా సమస్యల పరిష్కారంలో తుకారామ్ పోషించిన పాత్ర, జర్నలిజానికి ఆయన అందించిన సేవలు మరవరానివని కొనియాడారు.తెలంగాణ మీడియా అకాడమీ ద్వారా జర్నలిస్ట్ తుకారామ్ కుటుంబానికి వచ్చే ఎక్స్-గ్రేషియా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఐజేయు సీనియర్ నాయకులు నగునూరి శేఖర్ సహకారంతో ఈ సహాయం అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే ( ఐజేయూ ) జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, సంఘం నాయకులు తారు, నరేందర్, మేకల శ్రీనివాస్, రాధాకృష్ణ చారి, ఎజాస్ అహ్మద్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**